PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com


96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 14, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 04 - మార్చి - 2026 , వెల రూ.5/-

## మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు చాలా కృషి



- మహిళా సాధికారత, భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచింది
- ప్రతి ఒక్కరు తప్పనిసరిగా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి
- రాష్ట్రంలో స్త్రీలపై నేరాలు తగ్గడం
- స్త్రీల భద్రత, రక్షణపైనే సమాజ భద్రత ఆధారపడి ఉంది



### కృత్రిమ మేధ వినియోగించి..
## పాలనలో సమర్థత పెంచాలి

- ఉన్నతాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి
- అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు సూచన

# అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు

### సీఎం చంద్రబాబును కలిసిన పవన్



**అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు**

మంగళగిరి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఏపీ ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టును చేపట్టింది. మంగళగిరిలో ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ మాట్లాడారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగని తెలిపారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు.

**సీఎం చంద్రబాబును కలిసిన పవన్**



సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. 'హనుమాన్' కార్యక్రమం ముగియగానే నేరుగా సీఎం ఇంటికి ఆయన వెళ్లారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై చర్చ జరిగింది. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'హనుమాన్' ప్రాజెక్ట్ వివరాలను సీఎంకు పవన్ వివరించారు



## హిందూ శరణార్థులెవరూ పౌరసత్వాన్ని కోల్పోరు

- రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే 45 రోజుల్లో ఏడో వేతన సంఘం సిఫారసులను అమలు చేస్తాం
- బీజేపీ ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది
- ఒక్క హిందూ శరణార్థి కూడా పౌరసత్వాన్ని కోల్పోకుండా చేస్తాం'
- 'పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్రమ చొరబాటుదారులను లేకుండా చేస్తాం

# తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలి

### సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ


- ★ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది
- ★ తెలంగాణకు రూ.10,000 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించింది
- ★ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి
- ★ గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించింది



ఢిల్లీ: తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించిన కిషన్‌రెడ్డి.. రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా మిగతా..2లో

## రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ..

### బుధవారం ఢిల్లీకి సీఎం రేవంత్



- తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులపై నేడు స్పష్టత
- ప్రతిపాదనలతో ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్, మహేష్ గౌడ్
- ఢిల్లీ రావాలని సీఎంకు రాహుల్ గాంధీ సూచన
- ఒక స్థానంలో సింఘ్వీ పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం
- రెండో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై కొనసాగుతున్న ఉత్కంఠ

## నేపాల్ ఎన్నికల ఎఫెక్ట్.. భారత్ సరిహద్దు 72 గంటల పాటు మూసివేత




- నేపాల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత్ సరిహద్దు మూసివేత
- నిన్న అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిబంధనలు
- భద్రతా కారణాల దృష్ట్యా రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటన

### కేంద్రం మౌనం తటస్థత కాదు..
# బాధ్యతారాహిత్యం

- ఇరాన్ అధినేత హత్యపై కేంద్రం మౌనాన్ని తప్పుపట్టిన సోనియా గాంధీ
- ఇది నైతిక బాధ్యతల నుంచి పారిపోవడమేనని విమర్శ
- మోదీ ఇజ్రాయెల్ పర్యటన తర్వాత దాడి జరగడంపై అనుమానం
- భారత విదేశాంగ విధానం ఒక వ్యక్తి చుట్టూ తిరుగుతోందని ఆరోపణ
- ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని వెల్లడి




ఢిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ మౌనంగా ఉండటం తటస్థత అనిపించుకోదని, అది నైతిక బాధ్యత నుంచి మిగతా..2లో

### 3 కోట్ల సబ్‌స్క్రైబర్లతో
# ప్రపంచ రికార్డు

- యూట్యూబ్‌లోనూ ప్రధాని మోదీ హవా..
- ప్రపంచ నేతల్లో అత్యధిక యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు కలిగిన వ్యక్తిగా రికార్డు
- ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి నేత
- యూట్యూబ్‌లో రాహుల్ గాంధీ కన్నా మూడు రెట్లు అధిక సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్టాలో ట్రంప్ కన్నా రెట్టింపు ఫాలోవర్లతో మోదీ అగ్రస్థానం




ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో ఆయన చానెల్ 3 కోట్ల (30 మిలియన్ల) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని మిగతా..2లో

### భారత్ లో పెట్రోల్, డీజిల్
# ఆంక్షలు తప్పవా..?

- హోర్ముజ్ జలసంధి మూసివేత.. నిలిచిన చమురు నౌకలు
- ఎల్పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం.. రేషనింగ్ దిశగా ప్రభుత్వం యోచన
- రష్యా ముడిచమురుపైనే భారత్ ఆశలు.. ఎగుమతులపై ఆంక్షలు!



ఢిల్లీ: పశ్చిమాసియాను కమ్ముకున్న యుద్ధ మేఘాలు సామాన్య భారతీయుడి జేబుపై, వంటింటిపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు దాదాపుగా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. సాధారణంగా రోజుకు 19.8 మిలియన్ బారెళ్ల చమురు ఈ మార్గం ద్వారా రవాణా కావాల్సి ఉండగా ఈ నెల 1 నాటికి అది ఏకంగా మిగతా..2లో


## చేతులెత్తేసిన ట్రంప్ ప్రభుత్వం... ఇజ్రాయెల్ లోని అమెరికన్లకు షాక్..!



- ఇప్పుడు తరలించడం సాధ్యం కాదన్న ఎంబసీ
- షెల్టర్లలో తలదాచుకోవాలని తన పౌరులకు సూచన
- 'తాబా' సరిహద్దు దాటడానికి ఇజ్రాయెల్ షటిల్ సర్వీసులు
- ఇలా ప్రయాణించే వారి ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వలేమని హెచ్చరిక

## ఇరాన్ యుద్ధ విమానాలను కూల్చివేసిన ఖతార్

### పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం



- ఇరాన్ దాడులను ఖండిస్తూ గల్ఫ్ దేశాల ఉమ్మడి ప్రకటన
- ఎదురు దాడికి వెరవబోమని ఇరాన్ కు హెచ్చరిక
- యుద్ధంలో ఇప్పటి వరకు ఇరాన్ లో 555 మంది మృతి

## నేపాల్ ఎన్నికల ఎఫెక్ట్..
## భారత్ సరిహద్దు 72 గంటల పాటు మూసివేత

ఢిల్లీ: నేపాల్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా భద్రతా చర్యలలో భాగంగా భారత్-నేపాల్ సరిహద్దును 72 గంటల పాటు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని నేపాల్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ శక్తులు దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్ లేదా నేపాల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు సరిహద్దు పాయింట్లను మూసివేయడం ఇరు దేశాల మధ్య ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈసారి కూడా 'ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ ప్లాన్ 2025'లో భాగంగా సరిహద్దును మూసివేయాలని నిర్ణయించినట్టు నేపాల్ సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్) అధికార ప్రతినిధి, డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట తెలిపారు. నిత్యావసర వస్తువుల రవాణా, సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న విదేశీయులకు మాత్రం మినహాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నేపాల్ పార్లమెంటులోని 275 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం 'జెన్ జడ్' ఉద్యమం కారణంగా కూలిపోయింది. అనంతరం ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో సుశీల కార్కి నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో విదేశీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కూడా నిషేధం విధించారు. అనుమానిత వ్యక్తులు, గ్రూపులు దేశంలోకి చొరబడకుండా నిరోధించేందుకు భారత సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)తో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట వివరించారు. 'జెన్ జడ్' ఉద్యమ సమయంలో లూటీకి గురైన ఆయుధాలు ఇంకా లభ్యం కాకపోవడంతో మరింత అప్రమత్తంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

## చేతులెత్తేసిన ట్రంప్ ప్రభుత్వం...
## ఇజ్రాయెల్ లోని అమెరికన్లకు షాక్..!

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, జెరూసలేంలోని అమెరికా రాయబార కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తదుపరి నోటీసు ఇచ్చే వరకు తమ నివాసాల్లోనే లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. "ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికన్లను ఇజ్రాయెల్ నుంచి ఖాళీ చేయించే స్థితిలో లేదా నేరుగా వారికి సహాయం చేసే స్థితిలో రాయబార కార్యాలయం లేదు" అని జెరూసలేంలోని అమెరికా ఎంబసీ ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన భద్రతా హెచ్చరికలో స్పష్టం చేసింది.

తరలింపు ప్రక్రియ ఇలా..

ఇజ్రాయెల్ పర్యాటక మంత్రిత్వ శాఖ నిన్నటి నుండి 'తాబా' సరిహద్దు దాటడానికి షటిల్ సర్వీసులను నడపడం ప్రారంభించిందని ఎంబసీ తెలిపింది. ఈ షటిల్ సర్వీసులో ప్రయాణించాలనుకునే పౌరులు పర్యాటక మంత్రిత్వ శాఖ యొక్క ఎవాక్యూషన్ ఫామ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించింది. ఈజిప్టుకు వెళ్లే తాబా భూ సరిహద్దు ప్రస్తుతం అందుబాటులో ఉందని, ఇది రోజుకు 24 గంటలు పనిచేస్తుందని పేర్కొంది.

ఎంబసీ కీలక సూచన..

"పర్యాటక మంత్రిత్వ శాఖ నడుపుతున్న ఈ షటిల్ సర్వీసుల విషయంలో అమెరికా రాయబార కార్యాలయం ఎటువంటి సిఫార్సు చేయడం లేదు. ఒకవేళ మీరు ఈ మార్గం ద్వారా వెళ్లాలని నిర్ణయించుకుంటే, మీ భద్రతకు అమెరికా ప్రభుత్వం ఎటువంటి గ్యారెంటీ ఇవ్వదు. ఇజ్రాయెల్ వదిలి వెళ్లాలనుకునే వారికి కేవలం సమాచార సేకరణ కోసం మాత్రమే ఈ వివరాలు అందిస్తున్నాము" అని ఎంబసీ స్పష్టం చేసింది. అలాగే, జోర్డాన్ వెళ్లాలనుకునే వారు ఎయిలాట్ వరకు షటిల్‌లో వెళ్లి, అక్కడి నుండి స్వతంత్రంగా 'యిత్జాక్ రాబిన్' సరిహద్దుకు చేరుకోవచ్చని అమెరికా రాయబార కార్యాలయం వివరించింది.

## మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు చాలా కృషి

అమరావతి: 'మహిళలను అందరూ గౌరవించాలి. ఈ సంస్కృతి మన ఇళ్ల నుంచే ప్రారంభం కావాలి. ప్రస్తుత సమాజంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. స్త్రీల భద్రత, రక్షణపైనే సమాజ భద్రత ఆధారపడి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో స్త్రీలపై నేరాలు 4.4 శాతం తగ్గాయి. మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు చాలా కృషి చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే.. వాటిని నేర్పుగా పరిష్కరించుకునే సామర్థ్యాలను ఆడపిల్లలకు తల్లిదండ్రులు అలవర్చాలి. అదే వారికి ఇచ్చే పెద్ద ఆస్తి' అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'రాష్ట్రంలో పోక్సో, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులు జైలు నుంచి బయటకు వచ్చినా వారిపై నిఘా కొనసాగుతుంది. తిరిగి వచ్చిన తర్వాత బాధితులను బెదిరిస్తే సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరుస్తాం' అని అనిత హెచ్చరించారు. మహిళా సాధికారత, భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ పోలీసుకు సంబంధించిన మహిళా, శిశు భద్రతా విభాగం లోగోను, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించిన మహిళా పోలీసులు కడలి రేవతి, హైమావతి, శైలజ, ఉషారాణిని హోంమంత్రి అనిత సన్మానించారు.

## రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ..
## బుధవారం ఢిల్లీకి సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎవరిని పంపాలనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థులను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్టీ అధిష్ఠానంతో చర్చించి రెండు స్థానాలకు పేర్లను ఖరారు చేయనున్నారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రతిపాదనలతో ఢిల్లీకి రావాలని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం లాంజ్‌లో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్, మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య ఈ విషయంపై ప్రాథమికంగా చర్చ జరిగింది. రాష్ట్రం నుంచి రెండు రాజ్యసభ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కనుండగా, అందులో ఒక సీటును సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీకే తిరిగి కేటాయించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో రెండో స్థానం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై బుధవారం జరిగే సమావేశంలో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## కృత్రిమ మేధ వినియోగించి..
## పాలనలో సమర్థత పెంచాలి

అమరావతి: ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగించడం ద్వారా పాలనలో సమర్థత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రజలకు ఉత్తమ సేవలు.. పనితీరు మెరుగుపరచుకునేందుకు ఉన్నతాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ రెస్పాన్స్‌పై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'డ్రోన్‌లు, సీసీ టీవీ కెమెరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి వినియోగించుకునేలా ఒక విధానాన్ని తీసుకురావాలి. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై తమిళనాడులోని శివకాశి వెళ్లి అధ్యయనం చేయాలి. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్‌స్టేషన్లలో ప్రయాణికులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లకు అవకాశం ఉండకూడదు. అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా.. అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి. ఒకే సమాచారం కోసం ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు' అని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కు పెంచినట్లు వారు తెలిపారు.

## భారత్ లో పెట్రోల్, డీజిల్
# ఆంక్షలు తప్పవా..?

ఈ నెల 1 నాటికి అది ఏకంగా 86 శాతం పడిపోయి కేవలం 2.8 మిలియన్ బారెళ్లకు చేరుకుంది. చమురు సరఫరాలో అంతరాయం ఇలాగే కొనసాగితే, దేశీయ అవసరాల దృష్ట్యా భారత్ కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎల్పీజీ రేషనింగ్:

భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో 80-85 శాతాన్ని గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుత నిల్వలు కేవలం రెండు వారాలకు మాత్రమే సరిపోతాయని అంచనా. ఈ నేపథ్యంలో గృహ అవసరాలకు సిలిండర్ల సరఫరాపై ప్రభుత్వం 'రేషనింగ్' (పరిమిత సరఫరా) విధించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై కోత:

భారత్ తను ఉత్పత్తి చేసే పెట్రోల్‌లో మూడో వంతు, డీజిల్‌లో నాలుగో వంతు విదేశాలకు ఎగుమతి చేస్తుంది. దేశీయంగా కొరత రాకుండా ఉండటం కోసం ఈ ఎగుమతులను నిలిపివేసి, ఆ నిల్వలను స్థానిక వినియోగానికే మళ్లించాలని ప్రభుత్వం భావిస్తోంది.

చమురు నిల్వల పరిస్థితి ఏంటి..

కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సరఫరా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. భారత్ వద్ద ప్రస్తుతం ఉన్న వ్యూహాత్మక నిల్వలు, రిఫైనరీలు మరియు ఓడరేవుల్లోని నిల్వలు కలిపి సుమారు 74 రోజుల అవసరాలకు సరిపోతాయని ఆయన తెలిపారు. ముడి చమురు నిల్వలు: 17-18 రోజుల వరకు, శుద్ధి చేసిన ఇంధనాలు: 20-21 రోజుల వరకు, ఎల్ఎన్జీ నిల్వలు: 10-12 రోజుల వరకు సరిపోతాయి.

ప్రత్యామ్నాయ మార్గాల వేట..

గల్ఫ్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో భారత్ ఇప్పుడు రష్యా నుంచి ముడిచమురు దిగుమతులను మరింత పెంచుకోవాలని చూస్తోంది. అలాగే అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల నుంచి చమురు సేకరణకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధం "రోజుల పాటు కాదు, వారాల పాటు" సాగే అవకాశం ఉందని హెచ్చరించడం భారత్‌ను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలకు ఇంధన లభ్యతలో ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చమురు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలి

మొదటి పేజి తరువాయి

ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు గుప్పించారు. సాస్కి పథకం కింద తెలంగాణకు రూ.10,000 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించిందని కిషన్‌రెడ్డి వివరించారు. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా, ఖజానా ఖాళీ అని నెపం నెట్టడంపై కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని లేఖలో ఆయన స్పష్టీకరించారు. "2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా 6 ప్రధాన గ్యారంటీలతో పాటుగా 420 హామీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. ఈ హామీలను నమ్మిన తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌కి అధికారాన్ని కట్టబెట్టింది. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ..రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీ-రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీరు మాట్లాడిన తీరును చూస్తుంటే, రాష్ట్ర ఖజానా నిల్ - కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతోంది. 2014 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టినినాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తూ వస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ..అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36,000 కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40,000 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50,000 కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40,000 కోట్లకు పైగా నిధులు, రూ.12,000 కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14,000 కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లకు పైగా నిధులు, విద్య & క్రీడలకు రూ.21,000 కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9,000 కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు మొదలైనవి ఉన్నాయి. అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించింది. మరో రూ.60,000 కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి పత్తిని సేకరించింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ఇవ్వడమే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ. 10 లక్షల కోట్ల ఋణాలను కూడా తెలంగాణ రాష్ట్రానికి అందించింది.

వీటికి అదనంగా రాష్ట్రాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మూలధన పెట్టుబడి నిధుల కోసం రాష్ట్రాలకు 50 సంవత్సరాల కాలపరిమితితో కూడిన వడ్డీ రహిత ఋణాలను అందించి ఆయా రాష్ట్రాల అభివృద్ధికి అదనపు సహకారాన్ని అందించాలనే ప్రధానమంత్రి మోదీ గారి సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం "స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి)" పేరిట ఒక నూతన పథకాన్ని 2020-21 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందించిన ఈ సౌలభ్యాన్ని సానుకూలంగా అందిపుచ్చుకున్న రాష్ట్రాలు 2020-21 నుండి నేటి వరకూ మూలధన పెట్టుబడితో కూడిన అనేక ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ఈ ఋణాల ద్వారా సమకూర్చుకున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి కూడా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. సాస్కి పథకం కింద 2020-21 నుంచి 2025-26 వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ. 10,000 కోట్లకు పైగా వడ్డీ రహిత ఋణాలను అందించడం జరిగింది. ఈ ఋణాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూలధన పెట్టుబడితో కూడిన కొన్ని వందల ప్రాజెక్టులు అమలుకు నోచుకున్నాయి. ..మురుగునీటి నాళాలు, రోడ్ల విస్తరణ, రైల్వే లైన్ల విస్తరణ, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, ఆసుపత్రులు, మెడికల్ & నర్సింగ్ కాలేజీలు, సంక్షేమ, మైనారిటీ పాఠశాలలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ORR & RRRమధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి-మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్ లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఖర్చు చేశారు.

..ముఖ్యంగా వీహెచ్ ఫేజ్ - ×× కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ. 114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ. 315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ORR & RRR మధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ. 200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాలలాగే తెలంగాణ రాష్ట్రం కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రహిత ఋణాల మీద ఆధారపడటం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలాంటి దుస్థితిలో ఉందో తెలుస్తోంది. ఇవి మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో తీసుకున్న ఋణాలకు వడ్డీలు చెల్లించడానికి ఋణాలు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ఋణాలు, రైతు భరోసా నిధులకు ఋణాలు, సంక్షేమ పథకాల అమలుకు ఋణాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఋణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి నేడు తెలంగాణలో ఉంది. ..2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోంది. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పెరుగుతున్న రాష్ట్ర తలసరి అప్పు కూడా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తోంది. ..ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కాబట్టి, మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరపున మిమ్మల్ని కోరుతున్నాను" అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## కేంద్రం మౌనం తటస్థత కాదు..
# బాధ్యతారాహిత్యం

మొదటి పేజి తరువాయి

అది నైతిక బాధ్యత నుంచి తప్పుకోవడమేనని ఆమె ధ్వజమెత్తారు. ఆమె విడుదల చేసిన ఒక ప్రకటనలో సార్వభౌమ దేశాధినేతను లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. "ఒకప్పుడు శాంతి, న్యాయం కోసం గొంతు విప్పిన భారత్, ఇప్పుడు తన చిరకాల మిత్రుడైన ఇరాన్ సంక్షోభంలో ఉన్నప్పుడు మౌనంగా ఉండటం మన దౌత్య విలువలకే విఘాతం" అని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాలపై దాడులను ఖండించిన ప్రధాని ఇరాన్‌పై జరిగిన దాడిని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగించుకుని వచ్చిన 48 గంటల్లోనే ఈ దాడి జరగడం కేవలం యాదృచ్ఛికం కాదని సోనియా గాంధీ అనుమానం వ్యక్తం చేశారు. భారత విదేశాంగ విధానం ఒక వ్యక్తి 'వ్యక్తిగత' దౌత్య కేంద్రంగా మారిపోయిందని ఆమె విమర్శించారు. రష్యా, చైనా వంటి బ్రిక్స్ దేశాలు ఈ దాడిని ఖండిస్తుంటే, భారత్ మౌనంగా ఉండటం 'నిశ్శబ్ద ఆమోదం' తెలిపినట్టుగా ఉందని, ఇది గ్లోబల్ సౌత్ దేశాల్లో మన పరపతిని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించాలని 'ఇండియా' కూటమి నిర్ణయించినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలోని లక్షలాది మంది భారతీయుల భద్రతను విస్మరించి, కేవలం అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకే కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఖమేనీ మృతికి సంతాపం కూడా తెలపకపోవడం చారిత్రక మిత్రుడికి ద్రోహం చేయడమేనని సోనియా అభివర్ణించారు.

## 3 కోట్ల సబ్‌స్క్రైబర్లతో ప్రపంచ రికార్డు

మొదటి పేజి తరువాయి

3 కోట్ల (30 మిలియన్ల) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. దీంతో ప్రపంచంలోని ప్రస్తుత, మాజీ దేశాధినేతల్లో యూట్యూబ్‌లో అత్యధిక సబ్‌స్క్రైబర్లు కలిగిన నేతగా ఆయన తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. ఈ ఘనతతో డిజిటల్ కమ్యూనికేషన్‌లో మోదీకి ఉన్న పట్టు స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇతర నేతలతో పోలిస్తే మోదీ భారీ ఆధిక్యంలో ఉన్నారు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు కేవలం 66 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు మాత్రమే ఉన్నారు. ఇది మోదీ సబ్‌స్క్రైబర్ల సంఖ్యలో దాదాపు నాలుగో వంతు మాత్రమే. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే ప్రధాని మోదీకి ఏకంగా ఏడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉండటం గమనార్హం. దేశీయంగా చూస్తే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూట్యూబ్ చానెల్ కన్నా మోదీ చానెల్‌కు సుమారు మూడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీల అధికారిక చానెళ్ల కన్నా కూడా మోదీ వ్యక్తిగత చానెల్ సబ్‌స్క్రైబర్లు నాలుగు రెట్లు అధికంగా ఉన్నారు. కొన్ని రోజుల క్రితమే (ఫిబ్రవరి 26న) ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల (100 మిలియన్ల) ఫాలోవర్ల మార్క్‌ను అధిగమించారు. ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 2014లో ఇన్‌స్టాగ్రామ్‌లో చేరిన మోదీ, గత దశాబ్ద కాలంలో ప్రపంచ నేతల్లో అత్యంత చురుకైన, విస్తృతమైన ఫాలోయింగ్ ఉన్న ఖాతాను నిర్మించుకున్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో రెండో స్థానంలో ఉన్న డొనాల్డ్ ట్రంప్‌కు 43.2 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, మోదీకి ఆయన కన్నా రెట్టింపు ఫాలోవర్లు ఉన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు), టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ (11.6 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇతర సోషల్ మీడియా వేదికలైన 'ఎక్స్' (ట్విట్టర్) లో ప్రధాని మోదీకి 10.63 కోట్ల మంది, ఫేస్‌బుక్‌లో 5.4 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ గణాంకాలు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా యువతలో ప్రధాని మోదీకి ఉన్న విస్తృతమైన ఆదరణను, బలమైన సంబంధాలను తెలియజేస్తున్నాయి.

## హిందూ శరణార్థులెవరూ
# పౌరసత్వాన్ని కోల్పోరు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బంపరాఫర్ ప్రకటించారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే 45 రోజుల్లో ఏడో వేతన సంఘం సిఫారసులను అమలు చేస్తామని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల నేపథ్యంలో దక్షిణ 24 పరగణాల జిల్లాలోరి మథురాపూర్‌లో బీజేపీ పరివర్తన్ యాత్రను అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును వ్యతిరేకించకపోతే.. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ప్రతి హిందూ శరణార్థి ఇప్పటికే పౌరసత్వాన్ని పొందేవాడు. అయినప్పటికీ హిందూ శరణార్థులెవరూ బాధపడాల్సిన అవసరం లేదు. బీజేపీ ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. ఒక్క హిందూ శరణార్థి కూడా పౌరసత్వాన్ని కోల్పోకుండా చేస్తాం' అని హామీ ఇచ్చారు. 'పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్రమ చొరబాటుదారులను లేకుండా చేస్తాం. చొరబాటుదారుల పేర్లను ప్రస్తుతం ఓటర్ల జాబితా నుంచి మాత్రమే తొలగిస్తున్నాం. దీనిపై మమతా దీదీ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్కసారి అధికారంలోకి వచ్చిందంటే చొరబాటుదారులను పూర్తిగా ఇక్కడి నుంచి పంపించేస్తాం. ప్రజల కోసం దీదీ చేసిందేమీ లేదు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను మాత్రం ఆమె బుజ్జగిస్తున్నారు. మేమే రామ మందిరాన్ని, కాశి విశ్వనాథ్, మహాకాల్ కారిడార్‌ను కట్టించాం. మమతా బెనర్జీ ప్రజల్ని విస్మరించి వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని సీఎం చేయాలని కంకణం కట్టుకున్నారు. ఇదే వారి పద్ధతి. దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు జీతాలు అందుకుంటున్నారు. బెంగాల్ ఉద్యోగులు మాత్రమే ఇప్పటికీ ఆరో వేతన సంఘం సిఫారసుల మేరకు జీతాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే 45 రోజుల్లో ఏడో వేతన సంఘం సిఫారసులను అమలు చేస్తాం' అని అమిత్ షా పునరుద్ఘాటించారు.

## లిక్కర్ కేసులో ఊరట.. కాలినడకన
## తిరుమల శ్రీవారి దర్శనానికి కవిత

హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ కేసు నుంచి విముక్తి లభించడంతో స్వామివారికి మొక్కు చెల్లించుకోవాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కాలినడకన అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమల కొండకు చేరుకోవాలని సంకల్పించారు. ఆమె పర్యటన వివరాలను సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 5వ తేదీన కవిత తిరుపతికి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం అలిపిరి నుంచి కాలినడకన కొండపైకి వెళ్లనున్నారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, ఆ మరుసటి రోజు అంటే 6వ తేదీన ఉదయం శ్రీవారిని దర్శించుకుని తన మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. సీబీఐ సరైన ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ కవితతో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి విముక్తుల్ని చేసింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు పెట్టారని నిందితులు ఆరోపించారు. కాగా, ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న కవిత దాదాపు 6 నెలల పాటు తీహార్ జైలులో ఉన్నారు. అయితే, కవిత తిరుమల పర్యటన కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితం కాదని, దీని వెనుక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆమె తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రానున్న రెండు నెలల్లో కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల్లో చురుగ్గా ఉంటున్న ఆమె, ఈ పర్యటన తర్వాత తన రాజకీయ కార్యాచరణను మరింత వేగవంతం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.

## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

ఢిల్లీ: ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుండగా, మరోవైపు ఇరాన్‌లో భూకంపం సంభవించింది. దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం గురించి వివరాలు తెలియాల్సి ఉంది. గెరాష్‌కు ఉత్తర వాయువ్య దిశలో 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రత నమోదు కావడంతో ఈ భూకంపాన్ని తేలికపాటి నుంచి మధ్యస్థాయి భూకంపంగా తెలిపారు. భూకంపం వచ్చిన ప్రాంతం ఎక్కువగా గ్రామీణ ప్రాంతం. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగు పెట్టారు. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ కాలేదు.

## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి
## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు

అమరావతి: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి బ్రాహ్మణి పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. కార్యక్రమం ముగిశాక వేద పండితులు మంత్రి దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ పవిత్రమైన కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంగళగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## ఖమేనీ మృతిపై భారత్ మౌనం.. దౌత్య వ్యూహమా? అనివార్యమా?

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ పరిణామంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ, అక్కడి పరిస్థితులు "తీవ్ర ఆందోళనకరం" అని మాత్రమే వ్యాఖ్యానించారు. అయితే, ఖమేనీ మృతికి అధికారికంగా సంతాపం ప్రకటించకపోవడం దౌత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇరాన్ అధ్యక్షుడి మృతికి జాతీయ సంతాప దినం ప్రకటించిన భారత్, ఇప్పుడు సుప్రీం లీడర్ విషయంలో మౌనం పాటించడం ఈ చర్చకు మరింత బలాన్నిస్తోంది. భారత్ ఈ వైఖరి తీసుకోవడం వెనుక బలమైన దౌత్య కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉన్న బలమైన వ్యూహాత్మక సంబంధాలు, అలాగే యూఏఈ, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ మిత్రదేశాలతో స్నేహాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఏఈపై జరిగిన దాడులను ప్రధాని మోదీ గతంలోనే తీవ్రంగా ఖండించారు. దీనికి తోడు, కశ్మీర్‌పై గతంలో ఖమేనీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కూడా ఈ కఠిన వైఖరికి ఒక కారణంగా చెబుతున్నారు. భారత ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కేంద్రం తీరును తప్పుబట్టాయి. ఇది భారత నైతిక నాయకత్వానికి దెబ్బ అని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించగా, ఒక సార్వభౌమ దేశాధినేతను హత్య చేయడాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. ప్రస్తుతానికి 'వేచి చూసే' ధోరణిని అవలంబిస్తున్నట్లు కేంద్రం సంకేతాలిస్తోంది. పశ్చిమాసియాలో నివసిస్తున్న సుమారు 90 లక్షల మంది భారతీయుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అందువల్ల ఏ పక్షానికీ మద్దతు ప్రకటించకుండా, కేవలం శాంతియుత చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని భారత్ సూచిస్తోంది.

## రియాద్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ల దాడి.. దద్దరిల్లిన సౌదీ

ఢిల్లీ: సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో తీవ్ర కలకలం రేగింది. ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయంపై రెండు డ్రోన్లతో దాడి జరిగింది. ఈ దాడిని సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. సౌదీ రక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం రెండు డ్రోన్లు ఎంబసీ భవనాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడి కారణంగా భవనంలో స్వల్పంగా మంటలు చెలరేగాయని, పాక్షికంగా ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. దాడి జరిగిన సమయంలో భవనం ఖాళీగా ఉండటంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం. దాడికి ముందు డిప్లొమాటిక్ క్వార్టర్ ప్రాంతంలో పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని, ఆ తర్వాత దట్టమైన నల్లటి పొగలు కమ్ముకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ పరిణామంపై సౌదీలోని అమెరికా మిషన్ వెంటనే స్పందించింది. రియాద్, జెడ్డా, దహ్రాన్ నగరాల్లో నివసిస్తున్న తమ పౌరుల కోసం "షెల్టర్ ఇన్ ప్లేస్" హెచ్చరికను జారీ చేసింది. ప్రజలందరూ వెంటనే సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, అనవసర ప్రయాణాలు చేయవద్దని సూచించింది. ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ క్రమంలోనే ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ దాడికి తామే బాధ్యులమని ఇప్పటివరకు ఏ సంస్థా అధికారికంగా ప్రకటించలేదు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## నేటి శుభోదయ, చిత్తూరు జిల్లా నగిరి

## క రియమాణిక్య స్వామి ఈరోజు మూతపడింది చంద్రగ్రహణం



కారణంగా ఉదయం 9 గంటలకు నుంచి రాత్రి 7:30 గంటల వరకు శ్రీవారి ఆలయం మూసివేస్తారు చంద్రగ్రహణం మధ్యాహ్నం 3. 20 గంటలకి ప్రారంభం అవుతుంది సాయంత్రం 6:47 గంటలకు ముగుస్తుంది అయితే చంద్రగ్రహణానికి6 గంటలకు ముందు గా ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది చంద్రగ్రహణం ముగిసిన తరువాత రాత్రి 7:30 గంటలకు ఆలయ తలుపులు తెరచి శుద్ధి చేసి తిరిగి భక్తులను అనుమతిస్తారు ఆలయ ఇన్స్పెక్టర్ రమణ తెలిపారు

## నేటి శుభోదయ, తిరుపతి జిల్లా.
## పుత్తూరుఅరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు...



సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ డిమాండ్...... పుత్తూరు పట్టణంలోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియుఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు అంగన్వాడి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండో తేదీ చలో విజయవాడ నిర్వహించడం జరిగింది అక్కడ శాంతియుతంగా అలంకార్ చౌక్ దగ్గర శాంతియుతమైన ధర్నా నిర్వహిస్తుంటే అంగన్ రెడ్డి వర్కర్స్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మూడో తేదీ కూడా ధర్నా కొనసాగిస్తుంటే ఉదయం ఐదు గంటలకు పోలీసులు



వచ్చి లైట్ ఆఫ్ చేసి టెంటును బ్యానర్లను పీకి వేసి నిద్రపోయే అంగన్వాడి వర్కర్లను ముక్కుముడిగా పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లడం దారుణం అన్నారు గతంలో కూడా ఈ ప్రభుత్వం అంగన్వాడి వర్కులను గుర్రాలతో తొక్కించి నారు అయినా అంగన్వాడి వర్కర్లు భయపడలేదని ఇప్పుడు మీరు అరెస్టు చేస్తే ఎవరు భయపడేది లేదని ఈ సందర్భంగా తెలియజేశారు గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసినట్టు చరిత్ర ఉందన్నారు ఆ ప్రభుత్వం ఇదేలా వ్యవహరిస్తే అంగన్వాడి వర్కర్లు ఇంటికి పంపించారని అట్లాంటి గతి ఈ ప్రభుత్వం తెచ్చుకోవద్దని అన్నారు వారి న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన అంగన్వాడి వెంటనే విడుదల చేయాలని గతంలో ఈ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారానికి వస్తే మీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని టెంట్లు దగ్గర హామీలు ఇచ్చారు ఇప్పుడు అధికారానికి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా మీరు ఇచ్చిన హామీ ఏమైంది అని ప్రశ్నించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు పుత్తూరులో శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ నుపోలీసులు అరెస్టు చేసి సొంత పూచికతో విడుదల చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఏ విజయ్, అంగన్వాడి నాయకురాలు విజయ కుమారి, రాధా, కృష్ణవేణి, గంగులమ్మ, ధనమ్మ,లలిత, మోహన్ లక్ష్మి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు

## నేటి శుభోదయ, చిత్తూరు జిల్లా
## నగిరి అంగన్వాడీల అక్రమ అరెస్టులు నిర్బంధం




రాష్ట్ర వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన ఈరోజు నగరి బస్టాండ్ కూడలిలో వద్ద రోడ్డు పైన ఆందోళనలో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య సిఐటియు నాయకురాలు దనకోటి పాల్గొన్నారు. వేతనాలు పెంచాలని కోరుతూ శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పై ధమనకాండను ఖండిస్తూ ఉ. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. అందులో భాగంగా నగిరిలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడలోనే అలంకార్ సెంటర్లో ప్రశాంతంగా ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలను ఉదయం 5 గంటలకు పోలీసుల దౌర్జన్యంగా వెళ్లే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నగరి బస్టాండ్ సర్కిల్ నందు అంగన్వాడి యూనియన్ నాయకులు దనకోటి లక్ష్మీ దేవి మైదిలి అధ్యక్షతన అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా ? అంటూ అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని , కోరుతూ ఫిబ్రవరి 23 నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున రాష్ట్ర ప్రభుత్వం స్పందించ కుండ వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంగన్వాడి న్యాయమైన డిమాండ్లను ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా వేతనాలు పెంచి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఏఐటీయూసీ పట్టణ నాయకులు మురళి యేసయ్య రాజ మహేంద్ర అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు దానకోటి లక్ష్మి దేవి మైదిలి షీలా దేవిక బుజ్జి వనిత పవిత్ర వరలక్ష్మి పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు

## పల్నాడు జిల్లా వ్యాప్తంగా
## వందలాది మంది అంగన్వాడీలు అక్రమ అరెస్ట్ లు..



నేటి శుభోదయ 3 పల్నాడు జిల్లా చిలకలూరిపేట :తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిన్న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగన్వాడి కార్యకర్తలు..ఆందోళన చేస్తున్న తమ పట్ల పోలీసులు పాశవికంగా ప్రవర్తించారంటూ మండిపడుతున్న అంగన్వాడీలు..తెల్లవారుజామున పోలీసులు పెద్ద ఎత్తున్న శిబిరంలోకి బలవంతంగా వెళ్లి వేలాది మందిని మూకుమ్మడిగా అరెస్టులు చేసిన వైనం..టెంట్ కూల్చేసి, లైట్లు ఆపేసి మహిళలను బలవంతంగా ఈడ్చుకుంటూ బస్సుల్లోకి ఎక్కించారంటూ అంగన్వాడీలు ఆవేదన.. పోలీసుల తీరు, ప్రభుత్వ చర్యలపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం.. ఈరోజు కూడా పిలుపునివ్వడంతో ఎక్కడికి అక్కడ అరెస్టులు.సత్తెనపల్లి,రాజుపాలెం,ముప్పాళ్ళ, చిలకలూరిపేట,రొంపిచర్లలో అంగన్వాడీలను అరెస్టులు..అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ, రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి లను సత్తెనపల్లి స్టేషన్ లో నిర్బంధించి పోలీసులు..

## రాజమండ్రి గవర్నమెంట్ ఆసుపత్రిలో ఘనంగా
## ఎమ్మెల్యే 'బత్తుల బలరామకృష్ణ' పుట్టినరోజు వేడుకలు..!!

**- ఎమ్మెల్యే 'బత్తుల' పేరుమీద హాస్పిటల్ కి మందులు భద్రపరుచు ఫ్రీజ్ విరాళంగా బహుకరించిన జనసైనికులు..అనుచరులు..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యుడు బత్తుల బలరామకృష్ణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన అభిమానులు, అనుచరులు, జన సైనికులు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రాజమండ్రి గవర్నమెంట్ హాస్పిటల్ లో కూడా ఎమ్మెల్యే బలరామకృష్ణ పుట్టినరోజును జరిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇంజక్షన్లు పెట్టుకోవడానికి ఫ్రిడ్జ్ లేదని హాస్పిటల్ సిబ్బంది తెలియ జేయగా జి.జి.హెచ్. డైరెక్టర్ సురేష్, ఏ.ఎం.సి. డైరెక్టర్ ఎర్రంశెట్టి పోలారావు, ఎస్.ఎం. నరేంద్రవర్మ ముగ్గురు కలిసి ఫ్రిడ్జ్ ను ఆసుపత్రికి విరాళం గా అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఎమ్మెల్యే బలరామకృష్ణ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏ.ఎం.సి. డైరెక్టర్ ఎర్రంశెట్టి పొలారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, అలాగే నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే బలరామకృష్ణడి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాలతో సుభిక్షంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, ఉద్యోగులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు శ్రీ సింగరమ్మ తల్లి.



గోకవరం-నేటిసుబోదయ.:జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు, ఇటు ప్రయాణించే ప్రయాణికులకు కోరిన కోరికలు తీర్చే అమ్మవారు సింగరమ్మ తల్లి అమ్మవారని టీటీడీ పాలక మండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం అమ్మవారిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ , జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ లు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంతానికి ఆరోగ్య దైవమని ఆయన అన్నారు. గత 70 సంవత్సరాల నుంచి పూర్వికుల నుంచి ఆచారం గా అమ్మ వారి జాతర మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్ని బేదాభిప్రాయాలు ఉన్న అమ్మవారి జాతర మాత్రం ఉమ్మడిగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ జాతర మహోత్సవాలు ఈనెల మూడవ తారీకు నుంచి మొదలుకొని ఏడో తారీఖు వరకు జాతర మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## గోకార్టింగ్ను గోదావరి జిల్లాలకు పరిచయం చేస్తు..

**' హెలికాప్టర్ రైడ్ సర్వీస్' ను ప్రారంభించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు..!!**

**- గోదావరి అందాలను ఆకాశం నుండి వీక్షించి, గొప్ప అనుభూతిని కల్పిచేందుకు హెలికాప్టర్ రైడ్ సర్వీస్..**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె): తూర్పుగోదావరి జిల్లాకు మరో మణిహారంగా ఆవిర్భావించిన గోకార్టింగ్ సర్వీస్ ను ఘనంగా ఏర్పాటు చేశారు. రాజానగరం నియోజకవర్గం రాజానగరం మండలం దివాన్ చెరువులో ఈ గోకార్టింగ్ సర్వీస్ ను స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు కేవలం మహా నగరాలకే పరిమితమైన గోకార్టింగ్ ను మన గోదావరి జిల్లాలకు పరిచయం చేసిన ఘనత ప్రముఖ ఏ. స్క్వేర్ వారికె, ఎమ్మెల్యే బత్తుల కె దక్కిందని స్థానిక ప్రజలు కొనియాడారు. ప్రజలకు మన గోదావరి అందాలను ఆకాశం నుండి వీక్షించేందుకు గొప్ప అనుభూతిని కల్పిచేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన హెలికాప్టర్ రైడ్ సర్వీస్ ను శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి, వీరి కుమార్తె వందనాంబిక హెలికాప్టర్ లో రైడ్ చేసి సర్వీస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కూటమి నేతలు, ఇతర ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.





## శ్రీరగపట్నం శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి
## షెడ్డు నిర్మాణానికి 'కంబాల' రెండు లక్షలు విరాళం..!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం, శ్రీరంగపట్నం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు రెండు లక్షలు రూపాయలు విరాళాన్ని కోరుకొండ గ్రామంలోని రామసేన కార్యాలయం వద్ద సోమవారం రాత్రి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణానికి 13 లక్షలు రూపాయలు విరాళాన్ని గతంలో ప్రకటించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మొదటి విడతగా మూడు లక్షలు రూపాయలు విరాళం అందించమని తెలుపారు. అలాగే సోమవారం రాత్రి మరో రెండు లక్షలు రూపాయలు చెక్ ను కమిటీ సభ్యులకు అందించారు. ఇప్పటి వరకు షెడ్డు నిర్మాణానికి ఐదు లక్షలు రూపాయలు విరాళాన్ని అందించినట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## అక్రమ సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



గోకవరం-నేటిసుబోదయ.:మోటార్ సైకిల్ పై సారాను అక్రమంగా తరలిస్తుండగా కలుం రాంబాబు అను రంపచోడవరం మండలం, పెనుకులపాడు గ్రామానికి చెందిన అతనిని అదుపులోకి తీసుకుని కలుం రాంబాబు వద్ద నుండి 35 లీటర్ల సారా, హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్ స్వాధీనం చూసుకుని, కేసు నమోదు చేసినట్లు గోకవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. రిమాండ్ నిమిత్తం రాంబాబుని కోర్టు నందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఎస్సైమాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ సారా తయారీ, రవాణా,విక్రయాలు వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## యాంత్రీకరణ జోడిస్తినే వ్యవసాయం లాభసాటి..!

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



వెల్దుర్తి: ఆర్ సి ఇన్చార్జి మార్చి 3; నేటి శుభోదయ :యాంత్రీకరణ జోడిస్తినే వ్యవసాయం లాభసాటిగా మారుతోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభిప్రాయపడ్డారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వ్యవసాయశాఖాధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులను అవగాహన పరిచి, ప్రకృతి వ్యవసాయం వైపు మరలించాలని కోరారు. అలానే సబ్సిడిపై వచ్చే వ్యవసాయ పనిముట్లు, బ్యాటరీ పవర్ స్ప్రెయర్లు, టార్పాలిన్ పట్టలు వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని సూచించారు. పంట మార్పిడి విధానం, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పరచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయాశాఖ ఏడీ జగదీశ్వర రెడ్డి, మాచర్ల ఏవో పాప కుమారి, రెంటచింతల ఏవో లక్ష్మారెడ్డి, వెల్దుర్తి బాలజీ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్త వైద్య ఖర్చులకు కంబాల పదివేలు రూపాయలు ఆర్థిక సహాయం.



గోకవరం-నేటిసుబోదయ.:గోకవరంమండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త కాయలసాయికుమార్ తారాజువ్వలు కాలుస్తుండగా ప్రమాదవశాస్తూ కంటిలో పడి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ విషయాన్ని కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా స్పందించిన అయన రంపయర్రంపాలెం గ్రామంలోని సాయి కుమార్ ఇంటికి వెళ్లి, అతని పరామర్శించారు. వైద్య ఖర్చులకోసం పదివేలు రూపాయలు ఆర్థిక సహాయం ఆన్లైన్ ద్వారా అందించారు. ముందు, ముందు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తలకి ఏ కష్టమొచ్చినా తాను ఎప్పుడు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, నాగ రమేష్, కరిబండి వెంకటేశ్వరరావు, రాయపాటి సత్యనారాయణ, దేశాల నరేష్, తాటికొండ సురేష్, మండే గౌతమ్, తుమ్మల బుజ్జి, పదిలం చక్రరావు, కాకర దుర్గారావు, నందూరి దుర్గారావు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం గుడివాడలో...
## పురోహితుల హోమ పూజలు

**-గల్ఫ్ లో ఉన్న భారతీయులందరికీ భగవంతుడు మనోధైర్యం కల్పించాలి**

**-పురోహిత సంఘ పెద్దలు**

**-సర్వ మానవాళి సుభిక్షంగా ఉండాలని హైందవ ధర్మం ఎప్పుడు కోరుకుంటుంది -పురోహిత సంఘ పెద్దలు**




గుడివాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రపంచ శాంతి కోసం గుడివాడలో హోమ పూజలు నిర్వహించారు.యుద్ధ నివారణ గల్ఫ్ లో భారతీయులందరూ సురక్షితంగా ఉండాలని కాంక్షిస్తూ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో వైదిక స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నక్షత్ర పూర్వక ఆదిత్యాది నవగ్రహ సహిత రుద్ర హోమ పూజల్లో రిత్వికులు, పురోహితులు పాల్గొన్నారు.రుత్వికుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా హోమ క్రతువులు నిర్వహించిన అనంతరం పురోహిత సంఘ పెద్దలు పూర్ణాహుతి సమర్పించారు.సర్వ మానవాళి సుభిక్షంగా ఉండాలని హిందూ ధర్మం సర్వద కాంక్షిస్తుందనీ ఈ సందర్భంగా పురోహిత సంఘ పెద్దలు అన్నారు.మంచి సంకల్పంతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ చంద్ర గ్రహణం పవిత్ర గడియల్లో హోమ పూజలు నిర్వహించడం అభినందనీయమని పూజల్లో పాల్గొన్న గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ పట్టపు చిన్న,గుడివాడ పట్టణ వైదిక స్మార్త పురోహిత సంఘం అధ్యక్షులు బైరవబోట్ల విజయకుమార్ కార్యదర్శి బొర్రా సుబ్రహ్మణ్యం.,సభ్యులు బొర్రా సాయి,కపిలవాయి సాయి, వట్టేం సత్య వరప్రసాద్,దేవరకొండ విశారద,జొన్నవిత్తుల ఆది విష్ణు,వేలేటి రాజా వెంకట సుబ్బా శాస్త్రి,కాశిబొట్ల రాఘవేంద్ర,యమీజాల శ్రీనివాసరాయ, పలువురు పురోహితులు పాల్గొన్నారు.

## గుంటలు పడ్డ రోడ్డుకు మోక్షం ..!



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి మార్చి 3; నేటి శుభోదయ :నియోజకవర్గ పరిధిలో గుంటలు పడి అధ్వానంగా మారిన రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించనున్నది. రోడ్ల ఆధునీకరణకు ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజురు చేసింది. రెంటచింతల మండల పరిధిలోని పాలువాయి, తుమృకోట, పశర్లపాడు రోడ్లుకు రూ. 2.90 కోట్లు, అలానే మాచర్ల మండలం అనుపు రోడ్డు రూ. 10 లక్షలు నిధులను ఖర్చు చేయనున్నారు. త్వరలో టెండర్లను పూర్తి చేసి, పనులు ప్రారంభిస్తామని మంగళవారం శాసన సభ్యుల వారి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# వైభవంగా గ్రామోత్సవం



పులిచెర్ల, మార్చి 3,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా. మంగళవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఉభయ దారులుగా కల్లూరు ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు.

# కల్లూరులో జడ్పీ సీఈవో ఆకస్మిక పర్యటన

**పులిచెర్ల ఎంపీడీఓ తీరుపై తీవ్ర అసహనం**



పులిచెర్ల, మార్చి 3, (నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు ఆకస్మికంగా పర్యటించారు. కల్లూరు పంచాయతీ పరిధిలోని కొత్త కాలనీలో డ్రైనేజ్ కాలువలు లేకపోవడం డ్రైనేజ్ అస్తవ్యస్తంగా ఉండడంతో టిడిపి నాయకులు కలెక్టర్, జడ్పీసీఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం సెలవు దినమైన సీఈవో రవికుమార్ నాయుడు కల్లూరు కొత్త కాలనీలో పర్యటించి డ్రైనేజ్ పరిస్థితి పై పరిశీలించారు. పరిస్థితి అధ్వానంగా ఉండడంతో మండల స్థాయి అధికారులైన ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో అందుబాటులోకి రాకపోవడం తో సెల్ ఫోన్ ద్వారా ఎంపీడీవో పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం. మండల పరిషత్తులో 15వ ఆర్థిక సంబంధ నిధులు దాదాపు రూ 60 లక్షలు ఉండడం వాటిని ఖర్చు చేయకపోవడం తదితర విషయాలపై ఎంపీడీవో తీరుపై. ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ సీఈవో పరిస్థితి పరిశీలించి, పంచాయతీ నిధులు, మండల పరిషత్ నిధులతో. వెంటనే డ్రైనేజ్ కాలువలకు ప్రతిపాదనలు తయారు చేసి ఆమోదానికి పంపాలని పంచాయతీ అభివృద్ధి అధికారి రమణయ్యను ఆదేశించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి రమణయ్య పంచాయతీలో నిధులు లేని విషయాన్ని సీఈవో తీసుకు వెళ్లడంతో. ముందు ప్రతిపాదనలు సిద్ధం చేయండి నిధులు మంజూరుకు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు.

# మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేయడం అభినందనీయం

**టూ టౌన్ సి. ఐ. హనీష్**



గుడివాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని



పురస్కరించుకుని పలువురు రక్తదానం చేయడం అభినందనీయమని గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జె. ఆర్. కె.హనీష్ అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్కా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళా సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య పరీక్షలు నిర్వహించబడినవి. అదేవిధంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో 42 సార్లు రక్తదానం చేసి 43వ సారి రక్తదానం చేసిన శాయన కృష్ణార్జునరావు, టూ టౌన్ మహిళా ఎస్. ఐ., పలువురు రక్తదాతలను సి. ఐ. హనీష్ అభినందించారు. జిల్లా ఎస్. పి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు గుడివాడ ఇంచార్జ్ డి. ఎస్. పి. చలసాని శ్రీనివాసరరావు సూచనల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందనారు.

# ముదినేపల్లి గుడివాడ రూట్‌లో మల్లాయపాలెం రైల్ గేట్ 6వ తేదీ వరకు మూసివేత

గుడివాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడనుంచి ముదినేపల్లి వెళ్లే మల్లాయపాలెం రైల్ గేట్ ట్రాక్ రిపేర్ పనుల కారణంగా 6వ తేది వరకు మూసివేయనున్నట్లు తెలిపారు.వాహనదారులు కింది ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని అన్నారు. పెదపాలపర్రు బైపాస్ రోడ్ నుంచి సిద్ధాంతం మీదుగా గుడివాడ లేదా మల్లాయపాలెం నుంచి దొండపాడు మీదుగా గుడివాడ వెళ్ళవచ్చని తెలిపారు. వాహనదారులు ముందస్తుగా ప్రయాణ ప్రణాళిక వేసుకుని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు.

# ప్రత్యేక దృష్టితో నీటి ప్రాజెక్టుల అభివృద్ధి:గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**-ఇరిగేషన్,డ్రైనేజీ, విద్యుత్ శాఖలు,నీటి సంఘాలతో సమావేశమైన ఎమ్మెల్యే రాము**

**-తూడు తొలగింపు పనుల్లో....నీటి సంఘాల అలసత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**

**-క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాలువల్లో అభివృద్ధి పనులు పరిశీలిస్తా: ఎమ్మెల్యే రాము**

**-వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చెరువులు నింపుతాం: ఎమ్మెల్యే రాము**

**-నియోజకవర్గంలోని కీలకమైన ఆక్వా సాగుకు అవసరమయ్యే సాగునీరు అందించేందుకు కృషి: ఎమ్మెల్యే రాము**





గుడివాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ నియోజక వర్గంలోని నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తానని చెప్పారు.గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నీటి సంఘాల కమిటీలు,డీసీ చైర్మన్లు, ఇరిగేషన్, డ్రైనేజీ, విద్యుత్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం సమావేశం అయ్యారు. సాగునీటి ప్రాజెక్టుల సమస్యల వివరాలను సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల కమిటీ సభ్యులు, డిసి చైర్మన్లను మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే రాము అధికారులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే రాము, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా కాలువల నిర్వహణ,తూడు తొలగింపు పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా, బాధ్యతతో పనిచేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల పెద్దలకు ఎమ్మెల్యే రాము చెప్పారు. గత ఏడాది చక్కటి ఫలితాలు వచ్చాయని, ఏడాది నీటి సంఘాల అలసత్వంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.సాగునీరు అందక కోట్లలో నష్టపోతున్నామని, సమావేశంలో పాల్గొన్న ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానమైన వడ్లమన్నాడు డ్రైన్, చంద్రయ్య కాలువ,దోసపాడు చానల్,నెహ్రాలి ఇలా ప్రధానమైన ప్రాజెక్టులతో పాటుగా,పంట కాలువల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సంఘాలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చెరువులు నింపాలన్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన ఆక్వా రైతులకు సరిపడా నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కాలువల్లో తూడు తొలగింపు పనుల్లో కొంత అలసత్వం కనిపించిందని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాలువల్లో అభివృద్ధి పనులను సమీక్షిస్తానని ఎమ్మెల్యే రాము చెప్పారు.గుడివాడ నియోజకవర్గంలో ప్రధానమైన ఆక్వా రైతాంగ సాగుకు సరిపడా నీరు అందిస్తామని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.నందివాడ మండలంలో 31 వేల ఆక్వా సాగు అధికారంగా సాగు అవుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ పైలెట్ ప్రాజెక్టు కూడా నందివాడ మండలంలో చేపట్టిన నేపథ్యంలో ఆక్వా రైతాంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు ఈఈ ఆంజనేయ ప్రసాద్,డి. ఈ. సూర్య భారత్, డి. ఈ. నాగేంద్ర కుమార్, ఎ. ఈ. లు అనిల్, అరుణ్, కుమార్,నిర్మల,లక్ష్మి,బేగ్, ఎలక్ట్రికల్ డి. ఈ. శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,డి. సి. చైర్మన్లు యార్లగడ్డ రవి, బొమ్మనబోయిన ఏసు,



వెంకట బసవ కుటుంబరావు, మల్లీపెద్ది సుబ్రమణ్యం, వెంకట శివ నాగాంజనేయులు, పాలడుగు నానారావు, గుడివాడ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, ఆక్వా రైతులు, నీటి సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

**-విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్**



విజయవాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేవలం తన ప్రచారం కోసం రైతుల పాస్ పుస్తకాలపై తన ఫోటోను ముద్రించుకున్నారని, అది ఆయన చేసిన పెద్ద తప్పని గన్నవరం ఎమ్మెల్యే, విప్ యార్లగడ్డ వెంకట్రావ్ మండిపడ్డారు. మంగళవారం విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో ఏ. పి రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా నూతన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 19 మంది ముఖ్యమంత్రులు, చివరకు బ్రిటీష్ కాలంలో భూ హక్కుల కోసం కృషి చేసిన థామస్ మన్రో లాంటి వారికి కూడా రాని ఇటువంటి దిక్కుమాలిన ఆలోచన జగన్ రెడ్డికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్దుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం మేరకు తిరిగి ప్రభుత్వ రాజముద్ర మరియు వెనుక భాగంలో తెలుగు తల్లి చిత్రంతో కూడిన గౌరవప్రదమైన పాస్ పుస్తకాలను అందిస్తోందని తెలిపారు. పి.నైనవరం గ్రామంలో మొత్తం 467 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రస్తుతానికి 455 మందికి భూ సరిహద్దుల మ్యాప్‌లతో కూడిన కొత్త పుస్తకాలు పంపిణీ చేశామని అన్నారు. మిగిలిన రైతులకు



కూడా రీ-సర్వే పూర్తి చేసి త్వరలోనే అందిస్తామన్నారు. విజయవాడ రూరల్ పరిధిలోని 9 గ్రామాల కోసం రామవరప్పాడు లో సర్కిల్ కార్యాలయం కోసం ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డీసీపీ, ఎంఆర్ఓలను కోరానని, స్థలం గుర్తింపు కాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గం లోని 9 గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వీటిని విజయవాడ నగరపాలక సంస్థ లో విలీనం చేయడం ఒక్కటే మార్గమని, ఆ దిశగా కచ్చితంగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు.నైనవరంలో కృష్ణ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన 10 ఎకరాల భూమి కేటాయింపుపై ఉన్న అడ్డంకులను తొలగించాలని ఎంఆర్ఓను ఆదేశించారు. భూమి అప్పగించగానే ఇక్కడ పీజీ సెంటర్ ప్రారంభించడానికి కృష్ణా యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీ సెంటర్లలో బ్లడ్ టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, పి. నైనవరం గ్రామ టిడిపి అధ్యక్షులు బెజవాడ రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జి గుజ్జర్లపూడి బాబురావు, యూనిట్ ఇంచార్జి షేక్ నబి, టిడిపి నాయకులు సాతులూరి కోటేశ్వరరావు, దావు హనుమంతరావు, బోనిగే వెంకటేశ్వరరావు, చప్పిడి రమేష్, నాగరాజు, పట్టపు వెంకటేశ్వరరావు, పోకల చిన్నబాబు, మొతుకూరి వీరయ్య మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ మనందరి బాధ్యత

**-అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దు**

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**


**-పోలీస్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే**

**-గంజాయి నివారణకు తీసుకుంటున్న చర్యలపై అభినందించిన ఎమ్మెల్యే**



గుడివాడ, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) శాంతి భద్రతల పరిరక్షణ మన అందరి బాధ్యతని, ఆసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమావేశం అయ్యారు. సమావేశంలో పాల్గొన్న సీఐలు సోమేశ్వరరావు, శ్రీనివాస్, హనీష్ లతో పలు అంశాలపై ఎమ్మెల్యే రాము మాట్లాడారు. గంజాయి నియంత్రణకు తీసుకున్న చర్యలపై పోలీసులను ఎమ్మెల్యే రాము అభినందించారు. ప్రధానంగా పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మితమవుతున్న దృష్ట్యా నెలకొన్న ట్రాఫిక్ రద్దీ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా సందర్భాన్ని బట్టి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు.అసాంఘిక శక్తులు, అసాంఘిక కార్యాలపాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ మనందరి బాధ్యత కావాలని పోలీసులతో ఎమ్మెల్యే రాము అన్నారు. గుడివాడలో ప్రశాంత వాతావరణం కొనసాగేలా తీసుకునే చర్యలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే రాము చెప్పారు.ఈ సమావేశంలో పలువురు ఎస్సైలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం



యాడికి మార్చి 03 అనంతపురం జిల్లా రిపోర్టర్ :బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు లో భాగంగా మంగళవారం స్వామివారికి కళ్యాణం నిర్వహించారు.మధ్యాహ్నం చంద్రగ్రహణం కారణంగా తెల్లవారుజామున మూడు గంటలకే కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో యాడికి పురవీధులలో ఊరేగించారు. రథానికి డ్రైవర్ల సంఘం, హాస్పిటల్ కాలనీకి చెందిన ఆజాద్ భాషా, మరి కొంతమంది సమర్పించిన గజమాలలు తో అందంగా అలంకరించారు. గోవిందా, గోవిందా ,జై చెన్నకేశవ అని భక్తులు గోవింద నామస్మరణతో మార్మోగింది. రథోత్సవం సందర్భంగా పలువురు దాతలు మజ్జిగ మరియు పానకం పంపిణీ చేశారు. కళ్యాణం అనంతరం గుడిలో దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేయడం జరిగింది. ఉదయం 9 గంటల నుంచి 6000 మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పురవీధులలో ఊరేగింపుగా వెళ్ళిన రథం మధ్యాహ్నం 12:30 గంటలకు గూటిలోకి చేరుకుంది. అనంతరం చంద్రగ్రహణం



కారణంగా స్వామివారి ఉత్సవమూర్తులను గుడిలో ఉంచి ఆలయ తలుపులను మూసివేయడం జరిగింది.



గ్రహణ కాల సమయంలో అనంతరం ఆలయాన్ని సంప్రోక్షణ చేసి శుద్ధి చేసిన తర్వాత ఆలయ తలుపులు తెరుస్తారని ఆలయ పూజారి హరి స్వామి తెలిపారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.,

# పవన్ కళ్యాణ్ ఆదర్శం గా తుమ్మలల్లి రమేష్ డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ



**జగ్గంపేట లో ప్రతీ మంగళవారం తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో నిర్వహణ**

కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 03 నేటి శుభోదయ : జగ్గంపేట నియోజకవర్గం జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన నాయకులు హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శం గా తీసుకుని డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో నిరుపేద ప్రజలకు భోజనాన్ని అందించే కార్యక్రమం మా నాయకులు తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు అని అన్నారు.ఈరోజు డొక్కా సీతమ్మ కాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మాదారపు వీరబాబు,కురుమళ్ళ నాగేశ్వరరావు,సత్తి సోమరాజు, పాబోలు స్వామి,శ్రీను, డ్రిల్లు మాస్టారు, శ్రీమన్నారాయణ, మేడిబోయిన బాబురావు,వీర మహిళ గోపిక అంబిక తదితరులు పాల్గొన్నారు.

# వేలాది మందికి అన్నదాన వితరణ చేసిన చవ్వా గోపాల్ రెడ్డి




యాడికి మార్చి 03 అనంతపురం జిల్లా :రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా యాడికి



మండల కేంద్రంలో మంగళవారం వేలాదిమందికి క్లాస్ వన్ కాంట్రాక్టర్ ,టిడిపి సీనియర్ నాయకులు చవ్వా గోపాల్ రెడ్డి, ఆయన కుమారుడు చవ్వా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో చవ్వా అనుచర బృందం తిరునాళ్లకు వచ్చిన వేలాదిమందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చవ్వా అనుచర బృందం చీమల వాగు పల్లె సత్య ,గండికోట లక్ష్మణ్, బద్దెల రాముడు, మాజీ సర్పంచ్ రామకృష్ణ, రామాంజనేయులు నరసింహులు పాల్గొన్నార

## సీతానగరంలో రైతులకు జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

**ప్రజల కోసం నిరంతరం పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు మీ ఆశీస్సులు ఇవ్వండి... జ్యోతుల నవీన్**



కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 3: నేటి శుభోదయ :రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. మంగళవారం జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలో 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ రైతులకు రాజముద్రలతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూమిపై సర్వ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, భూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఈ రోజుల్లో మనభూమి మన వారసులకు తెలియాలంటే సాంకేతిక పరిజ్ఞానంతో అమెరికాలో ఉన్న మన పాస్ పుస్తకం లో క్యూఆర్ కోడ్ ద్వారా మన భూమి ఎన్ని కిలోమీటర్లు ఉంది ఎక్కడ ఉంది తెలుసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిబద్ధతతో పనిచేస్తున్నారని దానికి నిదర్శనం వేట్లపాలెం లో జరిగిన అగ్ని ప్రమాదమేనని ఆయన విజయనగరం నుండి ఒక్క సెక్యూరిటీ గార్డ్ తో హుటాహుటిన సంఘటనా స్థలానికి తరలివచ్చి బాధితులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తారని అదేవిధంగా ఎక్కడికక్కడ పరిసరాలను పరిశుభ్రంగా లేని కారణంగా దీనిపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వివరణ కోరి తక్షణమే పనులు చేయించిన వైనం ఆయన పనితనానికి నిదర్శనం ఇస్తుందని అదేవిధంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారని వీరికి మీ చల్లని ఆశీస్సులు అందుకోవాలని నవీన్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణి బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, బుర్రి సత్తిబాబు, రేఖ బుల్లి రాజు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, నండ్ల చిరంజీవి, ఎమ్మార్వో రమేష్, ముత్యాల సత్యనారాయణ (బుజ్జి) కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, తాతిన నాగేశ్వరరావు, ఈర్పిన శ్రీను, గూడపాటి సత్యనారాయణ (పెద్ద), సింగం శివ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో నిద్రాణమైఉన్న సృజనాత్మకను వెలికితీయాలి

**-ఆత్మీయ కళామిత్రులు శీరం శ్రీనివాసరరావు**




గుడ్లవల్లేరు, మార్చి 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): విద్యార్థులలో నిద్రాణమై ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను గుర్తించాలని ఆత్మీయ కళా మిత్రులు, నటులు, ఉపాధ్యాయులు శీరం శ్రీనివాసరరావు అన్నారు. గుడ్లవల్లేరులోని ఏ. ఏ. ఎన్. ఎం. అండ్ వి. వి. ఆర్. ఎస్. ఆర్. ఇంగ్లీష్ మీడియం స్కూలు 38వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ సరైన శిక్షణ ద్వారా పదును పెట్టి, చదువుతోపాటు చక్కటి ప్రదర్శనలతో విద్యా ,సేవా రంగాల్లో ఎంతో గొప్ప చరిత్ర సృష్టించ గల శక్తివంతులుగా విద్యార్థులు ఎంతో గొప్ప స్థాయికి చేరుకునే రీతిలో ఉపాధ్యాయులు. విద్యాసంస్థలు శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యార్థులు కూడా తాము ఎంచుకున్న వృత్తిలో రాణిస్తూనే, ప్రవృత్తి పరంగా కోరుకున్న కళాంశాలలో ఎదురయ్యే తిరస్కారాలు, అడ్డంకులు, అవమానాలను లెక్కచేయకుండా పట్టుదల,కసి, నిరంతర సాధనలతో , ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ కె.జి




చిన్నారులు ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు, ప్రాథమిక, మరియు ఉన్నత తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ , జానపద,పాశ్చాత్య, దేశభక్తి నృత్యాలు , సింధూర్ ఆపరేషన్ లో మహత్తర త్యాగాలు చేసిన భారతీయ వీర అమర జవాన్లకు నివాళిగా చేసిన ప్రత్యేక నృత్యం అలరించాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వివిధ రకాల ప్రతిభా పరీక్షల్లో, సాహితీ సాంస్కృతిక పోటీలలో విజేతలైన విద్యార్థులకు, వారికి శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులను మెమెంటోలతో సత్కరించడం సంతోషదాయకం. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని సుబ్బారావు,సెక్రటరీ& కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ , పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ , ఫార్మసీ కాలేజీల ప్రిన్సిపల్స్ ఎస్.ఎస్. ఎస్ వి రామాంజనేయులు, రాజశేఖర్. డాక్టర్ .బి.కరుణ కుమార్, డాక్టర్ పీ. కోదండ రామారావు,డాక్టర్ ఎమ్ అర్.సిహెచ్ శాస్త్రి.డా.ఎ లక్ష్మణరావు. వి.ఏ.కుంజమన్ , డైరెక్టర్ ఎన్ శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో శ్రీ వారాహి సోలార్ సొల్యూషన్స్ బ్రాంచి ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,జ్యోతుల నవీన్



కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 3 నేటి శుభోదయ :జగ్గంపేట లో స్థానిక గోకవరం రోడ్డులోని వాసుదేవ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ నందు శ్రీ వారాహి సోలార్ సొల్యూషన్స్ నూతన బ్రాంచి ప్రారంభోత్సవం జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమానికి మరో విశిష్ట అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, జగ్గంపేట కోపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణిమ్మ హాజరయ్యారు. 10 కిలోవాట్స్ సోలార్ ఇన్సులేషన్ మొదట కొనుగోలు చేసిన జిల్లా



టిడిపి ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న విద్యుత్ వినియోగం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని పెంచే లక్ష్యంతో రాయితీలతో కూడిన సోలార్ ప్యానెల్స్ పంపిణీకి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే స్థానిక ప్రజలకు అత్యాధునిక సోలార్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శ్రీ వారాహి సోలార్ సొల్యూషన్స్ ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది అని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వెలిశెట్టి శ్రీనివాసరావు, కమ్మిల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా ప్రియతమ నాయకులు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుండి సింగరమ్మ అమ్మవారి జాతర జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

**అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్**

**రద్దీని దృష్టిలో పెట్టుకొని కట్టు దిట్టమైన భద్రతాఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ**





కాకినాడ జిల్లా, జగ్గంపేట మార్చి 3 నేటి శుభోదయం :జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ శివారు దట్టమైన అటవీప్రాంతం సింగారమ్మ చింత లో కొలువై ఉన్న అమ్మవారు సింగారమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు మార్చి మూడో తేదీ మంగళవారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ జాతర మహోత్సవాల తొలిరోజు అమ్మవారిని జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ వారు వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు.మల్లిశాల గ్రామ వాసుల ఆరాధ్య దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధి కేక్కారు.ప్రతి సంవత్సరం మార్చ్ నెలలో అమ్మవారి జాతరను వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మంగళవారం నుండి అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆలయాకమిటి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆలయ ఆవరణలో మిరుమిట్లు గోలిపే విద్యుత్ దీప కాంతులకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.చిన్నపిల్లలు,యువతను ఆకర్శించడానికి ఆలయ ఆవరణలో జాయింట్ వీల్స్, రంగులరట్నాలు సిద్ధం చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు కోసం క్యూ లైన్ ఏర్పాటు చేశారు. సింగారమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మొక్కులు తీర్చుకొని ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యులందరితో సహాపంక్తి భోజనాలు చేస్తారు. ఆలయ ఆవరణలో ఆనందంగా గడుపుతారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనేకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.మార్చ్ 3 నుండి 7వరకు అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరగనుంది.అమ్మవారి జాతర పురస్కరించుకొని ఐదుగురు కమిటీ ప్రెసిడెంట్లు ముంద్రు కృష్ణారావు (ఎర్రబాబు ), పైడిపాల సూరిబాబు, పాలికిరెడ్డి సత్యనారాయణ, నక్కరాజు వీరబాబు, కుప్పల నాగు లను కమిటీ ప్రెసిడెంట్ లుగా నియమించారని, అందరి సమన్వయంతో జాతర ను విజయవంతం చేయడానికి కృషి చేస్తామని ఈ సందర్బంగా వారు తెలియజేశారు.ఈ సందర్భంగా సింగారమ్మ ఆలయ కమిటీ ప్రెసిడెంట్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చ్ నెలలో సింగారమ్మ అమ్మవారి జాతర మల్లిశాల గ్రామస్తుల సహాయ సహాకారాలతో అత్యంత వైభవంగ మల్లిశాల లో జాతర ప్రారంభమై రాత్రి కీ సింగారమ్మ అమ్మవారి ఆలయం వద్ద తీర్థం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి జాతరకు విచ్చేసి అమ్మవారి ని దర్శించుకొని వెళ్ళవలిసిందిగా ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీని మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, సర్పంచి సర్వసిద్ధిలక్ష్మణరావు,పాలచర్ల నాగేంద్ర చౌదరి, పల్లికొండ భద్రం, తొట్టిపూడి నాగేశ్వరరావు, సియాధుల పెద్దకాపు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో జీఎంసీ బాలయోగి చిరస్థాయిగా నిలిచి ఉంటారు...

**ఈ ప్రాంత అభివృద్ధిలో అడుగడుగున ఆయన జాడలున్నాయి...**

**బాలయోగి వర్ధంతి సందర్భంగా లో నివాళులు అర్పించిన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్...**



కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 3 నేటి శుభోదయ :ఉమ్మడి గోదావరి జిల్లాల ముద్దుబిడ్డ, భారత లోక్ సభ మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి సేవలు అజరామరమని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. మంగళవారం బాలయోగి వర్ధంతి సందర్భంగా ఆయన జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతుల నవీన్ ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బాలయోగి పేరు ప్రఖ్యాతులు ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. గోదావరి జిల్లాలలో ఏ మూలకు వెళ్ళినా ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన అడుగుజాడలు కనిపిస్తాయన్నారు. యానాం - ఎదుర్లంక వారధి, బోడసకుర్రు వారధుల నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అందరితో సఖ్యంగా ఉంటూ మన బాలయోగి, మనవారు అని పేరు తెచ్చుకున్నారన్నారు. ఒక దశాబ్ద కాలం పాటు వివిధ పదవుల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించి లోక్సభ స్పీకర్ గా ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. వారి మీద అభిమానంతో వారి కుమారుడు హరీష్ మాధూర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చిరకాలం బాలయోగి నిలిచి ఉంటారని కొనియాడారు. ఆయన బాటలో నడిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, కందుల చిట్టిబాబు, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, బుర్రి సత్తిబాబు పాండ్రంగి రాంబాబు, తూము కుమార్, యిడుదల అర్జునరావు, రాయి సాయి, పిల మహేష్, రాష్ట్ర డైరెక్టర్ గెద్దాడ సత్యవేణి,కొండ్రోతు శ్రీను, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేలుజాతి గుర్రాల ప్రదర్శన మరియు ఎద్దుల దూలాల పందాలు



యాడికి మార్చి 03 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం యాడికి లోని వేములపాడు రోడ్డులో గల మార్కెట్ యార్డులో ఉదయం 11 గంటలకు



మేలుజాతి గుర్రాల ప్రదర్శన నిర్వహించబడును అని నిర్వాహకులు తెలియజేశారు.మధ్యాహ్నం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించబడును. పోటీలను చూడడానికి వచ్చే ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం ఏర్పాటు చేయడమైనదని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు

## పేదలకు అన్నదానం.



నేటి శుభోదయ - వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర.శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి జన్మదినం వేడుకలను వెలుగోడు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి గుడి నందు ఘనంగా నిర్వహించారు. టీడీపీ సమన్వయ కర్త అన్నారపు శేషిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి చెంచుల పిల్లలకు పంచారు. ఆతర్వాత పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఇంకా ఎన్నో పుట్టినరోజు లు జరుపుకోవాలని 108 వ బూత్ లో కేక్ కటింగ్ నిర్వహించిన పెద్దలు కౌలయ్య రాముడు, గడియారం మద్దిలేటి , యిదుల చెరువు అధ్యక్షులు శ్రీనివాసులు, ఎ శ్రీనివాసులు, తెలుగు గోవిందు,పెద్ద అచ్చయ్య ఎన్నో ఉన్నత పదవులు పొంది రాజకీయంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం , రైతు సంఘము అధ్యక్షులు సూర్యనారాయణ , బలుసా రాము , క్లస్టర్ ఇంచార్జి ఖలీల్ వెలుగోడు మండలం లోని తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఐదుగురు అరెస్ట్

**నాలుగుకి జైలు శిక్ష ఒక్కరికి జరిమానా విధించిన కోర్ట్**



కాకినాడ జిల్లా, జగ్గంపేట మార్చ్ 3 నేటి శుభోదయ :కాకినాడ జిల్లా జగ్గంపేట లో సీఐ వైర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ .జిల్లా ఎస్పీ.బిందు మాధవ్ ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు,రోడ్డు ప్రమాద మరణాల నివార చర్యలలో భాగంగా. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిగా ఐదు మంది నిందితులను డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో . పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా అందులో నాలుగు మందికి ఒక్కొక్కరికి ఐదు రోజులు చొప్పున జైలు శిక్ష విధించడం జరిగిందాని. వారిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించడం జరిగిందాని . అందులో ఒక ఆసామి కి పదివేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు.ఎవరైనా త్రాగి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన.కఠిన చర్యలు తప్పవు అని జగ్గంపేట సీఐ వైర్ కె శ్రీనివాస్ తెలిపారు

## అనారోగ్యంతో ఉన్న విద్యార్థినికి ఆర్థిక సహాయం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్.



బాపట్ల నేటి శుభోదయమార్చ్ 3 :అనారోగ్యంతో ఉన్న విద్యార్థిని కి మెరుగైన వైద్యం చేయించుకొవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ అన్నారు.బాపట్ల పట్టణంలోని స్థానం వారి వీధిలో ఉంటున్న టి. శ్రీనివాసరావు కుమార్తె సూర్యలంక రహదారిలోని సరస్వతి మెమోరియల్ జూనియర్ ఇంటర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతూ అనారోగ్యంతో ఉండడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ చదువుల తల్లిగా మంచిగా చదువుకుంటూ అనారోగ్య పాలై అయిందని, వైద్యం చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతూ పరీక్షలు రాస్తుందని అనారోగ్యంతో ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాలకు పరీక్ష రాస్తుందన్నారు. విద్యార్థి తండ్రి వైద్య ఖర్చులకోసం ఆర్గనైజేషన్ ద్వారా సహాయం చేయాలని కోరడంతో సభ్యుల సహకారంతో విద్యార్థినీకి తమ వంతు సహాయాన్ని అందించామని చెప్పారు. మరికొందరు దాతలు ముందుకు వచ్చి విద్యార్థినికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి,కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు భీమా కోటేశ్వరరావు, బుర్ల సురేష్, ఓటికుండల లక్ష్మణరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి అంకమ్మ రావు, పెద్దమల్లు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రారండోయ్ వేడుకచూద్దాం!..

**రామయ్య పెళ్లి కొడుకాయేనే!..**

**అందరూ ఆహ్వానితులే!..**

**శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు!..**



వి.ఆర్.పురం,మార్చి3(నేటి శుభోదయ ప్రతినిధి):రారండోయ్ వేడుకచుద్దాం.రామయ్యను పెళ్ళికొడుకుని చేస్తున్నాం.అంటూ దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు,మండల ప్రజలను,భక్తులను గ్రామస్తులను కోరారు.ప్రతీ సంత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి హోళీపండుగ మరుసటిరోజు ఆనవాయితీగా వస్తుంది.ఈసంత్సరం చంద్రగ్రహణం ఉండటంతో 4వ తారీకున పండితులు ఆలయ అర్చకులు పురుషోత్తమా చార్యులు అందరూ కలిసి రామయ్యను పెళ్లి కొడుకును చేసే తంతు నిర్ణయించుకున్నారని ఆయన వివరించారు.శ్రీరామగిరి ఆత్యధ్మీకంగా చరిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన దక్షిణముఖ అద్భుతమైన పుణ్యక్షేత్రమని ఆయన తెలిపారు.సాక్షాత్తు శ్రీరాముడు నడయాడిన మహాద్భుతమైన పుణ్యక్షేత్రంలో రామయ్యను పెళ్ళికొడుకు చేసే అద్భుతమైన వేడుక కల్లారా చూసి తరించాలని కోరారు.రాముని చరితం విన్నా,చదివినా,ఎంతో పుణ్యంమని అలాంటి రాముణ్ణి పెళ్ళికొడుకునిచేసే టైం,చూసే భాగ్యంకలగడం ఎంతో పుణ్యమన్నారు.రామానామంలోనే అద్భుతమైన పవర్ ఉందని అందరూ రావాలని శ్రీరాముని పెళ్ళికొడుకు వేడుక చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మార్చి 9న ముఖ్యమంత్రి పర్యటన

**కొత్తబుర్జులో సభ స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే పరిశీలన**



నేటి శుభోదయ/ డోన్ నియోజకవర్గం ప్రతినిధి : మార్చి 9వ తేదీన డోన్ మండలంలోని కొత్తబుర్జు గ్రామంలో జరగనున్న నూతన పట్టాదారుల పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను వేగవంతం చేశారు. కొత్తబుర్జు గ్రామంలో సభ స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పరిశీలనలో యువ నాయకులు గౌరవనీయులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి , నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ కొల్లాబతుల కార్తీక్ , ఆర్డీఓ నరసింహులు , డోన్ డీఎస్పీ శ్రీనివాసులు గారు, ఆర్ & బి శాఖ అధికారులు పాల్గొన్నారు. వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ స్థల ఎంపిక, రూట్ మ్యాప్, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి తగిన సూచనలు అందించారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే, అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి ప్రతి అంశంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, పట్టాదారుల పాస్ పుస్తకాల పంపిణీ రైతులకు ఎంతో ప్రయోజనకరమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# ఒక్క రోజే రూ.7వేల కోట్లు... ఇరాన్‌తో యుద్ధానికి అమెరికా లెక్క ఇది..!






అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత?

ఒక్క రోజే రూ.7వేల కోట్ల వ్యయం..

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ (ఖూూ) మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. కానీ, 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను (భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు) ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి.

ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే) వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.59 కోట్లు) చొప్పున ఖర్చవుతుందట.

ఆయుధాలనూ కోల్పోతూ..

ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ (పొరపాటుగా జరిపిన కాల్పుల్లో)లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక [illegible], సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. "ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బడ్జెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం. ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే" అని అమెరికా మేథో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు క్రిస్టోఫర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆర్థికభారం భారీగానే..

కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.1 లక్షల కోట్ల)కు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# ఏఐ వినియోగంలో భారత్ జోరు




దేశీయంగా కృత్రిమ మేథ (ఏఐ) వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఎంటర్‌ప్రైజ్ విభాగంలో ఏఐ/ఎంఎల్ (మెషిన్ లెర్నిగ్) కార్యకలాపాలకు సంబంధించి అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. క్లౌడ్ సెక్యూరిటీ సేవల దిగ్గజం జీస్కేలర్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. భారత్‌లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతున్నప్పటికీ భద్రతాపరమైన సవాళ్లు గణనీయంగా ఉంటున్నాయని రిపోర్ట్ పేర్కొంది. ఏజెంటిక్ ఏఐని ఆయుధంగా ఉపయోగించకోవడం, నవకల్పనలు--భద్రత చర్యల మధ్య అంతరం భారీగా ఉండటం మొదలైనవి ఇందులో ఉన్నాయని వివరించింది. 2025 జనవరి--డిసెంబర్ మధ్య జీస్కేలర్ జీరో ట్రస్ట్ ఎక్ష?్సచంజ్ ప్లాట్‌ఫాంపై నమోదైన లక్ష కోట్ల ఏఐ, మెషిన్ లెరి?నంగ్ లావాదేవీల విశ్లేషణ ఆధారంగా జీస్కేలర్ ఈ రిపోర్టును రూపొందించింది. ఫిబ్రవరి 16--20 మధ్య భారత్‌లో ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026 జరగనున్న నేపథ్యంలో ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఎని?వడియా సీఈవో జెన్సన్ హువాంగ్, ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఆంథ్రోపిక్ సీఈవో డేరియో, క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో ఎమోన్ తదితర దిగ్గజాలు ఈ సదస్సులో పాల్గొనున్నారు.

## నివేదిక ప్రకారం..

దేశీ కంపెనీలు 2025 జూన్--డిసెంబర్ మధ్య కాలంలో ఏకంగా 8,230 కోట్ల ఏఐ/ఎంఎల్ లావాదేవీలు నిర్వహించాయి. ఆసియా--పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలో నమోదైన మొత్తం ఏఐ లావాదేవీల్లో ఇది 46.2 శాతం కావడం గమనార్హం. దీనితో ప్రాంతీయంగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. డిజిటల్ పరివర్తనకు ప్రభుత్వం దన్నుగా నిలవడంతో పాటు ఏఐ మౌలిక సదుపాయాలు--నైపుణ్యాల అభివృద్ధిపై ప్రభుత్వ--ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఏఐ సామర్థ్యాలున్న సిబ్బంది పెరుగుతుండటం, ఏఐ సేవలను వేగంగా, భారీ స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు వీలు కలి?పంచే క్లౌడ్--ఫస్ట్ విధానాలనేవి గతంతో పోలిస్తే భారత్ చాలా వేగంగా వృద్ధి చెందేందుకు తోడ్పడ్డాయి. దేశీయంగా ఏఐ కార్యకలాపాలకు దన్నుగా నిలుస్తున్న రంగాల్లో టెక్నాలజీ--కమ్యూనికేషన్ (3,130 కోట్ల లావాదేవీలు), తయారీ (1,570 కోట్లు), సర?వసులు (1,260 కోట్లు), ఫైనాన్స్--ఇన్సూరెన్స్ (1,220 కోట్ల లావాదేవీలు) ఉన్నాయి. కంపెనీల పర్యవేక్షణ సామర్థ్యాలకు మించిన వేగంతో ఎంటర్‌ప్రైజ్ ఏఐ వినియోగం పెరుగుతోంది. కానీ చాలా సంస్థల్లో కీలకమైన డేటా ఏ దశలో బహిర్గతమయ్యే అవకాశం ఉందో కనిపెట్టలేని భద్రతపరమైన లోపాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం నెలకొంది. ఏఐని దేనికోసం వినియోగిస్తున్నారు, ఏ డేటాను షేర్ చేస్తున్నారనే దానిపై ఓ కన్నేసి ఉంచుతూ, లీకేజీలను కట్టడి చేసేందుకు ఎప్పటికప్పుడు తగు చర్యలను అమలు చేస్తూ ఉండాలి. మార్కెట్ డిమాండ్‌కి తగ్గట్లుగా సురక్షితమైన ఏఐ వైపు మళ్లాలంటే డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వడం చాలా అవసరం. ప్రతికూల పరిస్థితులను సృష్టించి ఎంటర్‌ప్రైజ్ ఏఐ సిస్టంలను పరీక్షించినప్పుడు కేవలం నిమిషాల వ్యవధిలోనే వాటి బలహీనతలు బయట పడిపోతుండటమనేది సెక్యూరిటీపరంగా నెల కొన్న రిస్కలను సూచిస్తోంది. స్వతంత్రంగా ప్రణాళికలు వేసుకుని, చర్యలు కూడా తీసుకోగలిగే సామర్థ్యాలున్న ఏజెంటిక్ ఏఐ వినియోగం పెరుగుతోంది. ఈ టెక్నాలజీని ఇప్పటికే ఆయుధంగా మార్చుకుంటున్నారు. సైబర్‌క్రిమినల్స్, నిఘా గ్రూప్‌లు ఏఐని ఉపయోగించుకుని దాడులకు పాల్పడుతున్నాయనడానికి స్పష్టమైన ఆధారాలు తెరపైకి వస్తున్నాయి. ఏఐ ఏజెంట్లు నిఘా, చొరబాటు, విస్తృత దాడుల బాధ్యతలు తీసుకుంటున్నాయి. స్వతంత్రంగా, మెషిన్ వేగంతో, భారీ స్థాయిలో సైబర్ దాడులకు దిగుతున్నాయి. ఏఐ కేవలం ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగపడే సాధనంగానే ఉండటం లేదు, నేరగాళ్లకు ఆయుధంగా కూడా మారుతోంది. డేటా చౌర్యం తీవ్ర ఆందోళనకర అంశంగా మారుతోంది. 2025లో అంతర్జాతీయంగా ఏఐ అప్లికేషన్స్‌లోకి 18,000 టెరాబైట్స్ డేటా వచ్చి చేరింది. ఇది దాదాపు 360 కోట్ల డిజిటల్ ఫొటోలకు సమానం. ఏజెంటిక్ ఏఐ చొరబడిందంటే, సంప్రదాయ రక్షణ పద్ధతులు అడ్డుకోలేవు. నిమిషాల వ్యవధిలో భారీ స్థాయిలో డేటా చౌర్యం జరిగిపోతుంది. ఈ రిస్కలను ఎదుర్కొనాలంటే ఏఐని కట్టడి చేసేందుకు కంపెనీలు ఏఐనే ఆయుధంగా మార్చుకోవాలి. దాడులకు ఉపయోగపడే ఆస్కారమున్న అన్ని మార్గాలను మూసివేసేందుకు ప్రతి దశలోనూ భద్రతకు ప్రాధాన్యతనిచ్చే ఇంటెలిజెంట్ జీరో ట్రస్ట్ వ్యవస్థను వినియోగించుకోవాలి.

# సేంద్రియ ఆహారంతో.. ఆరోగ్యంపై సానుకూల ప్రభావం




ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో విస్తరించిన సేంద్రియ వ్యవసాయ సంస్థలతో కూడిన నెట్‌వర్క్ ఐఫోమ్-- ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్. జర్మనీలోని బాన్ కేంద్రంగా 1972 నుంచి పనిచేస్తోంది. 700 పైచిలుకు అనుబంధ సంస్థలకు సేంద్రియ సంబంధిత అంశాలపై చోదక శక్తిగా ఉంది. సేంద్రియ వ్యవసాయం, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్ నిపుణులు ఏమంటున్నారంటే..?

## సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలేంటి?

నేల సారాన్ని పెంపొందించడం, పరిశుభ్రమైన నీటిని అందుబాటులోకి తేవటం, జీవవైవిధ్యం కోసం పెట్టుబడి పెట్టడం, మట్టిలో సేంద్రియ పదార్థాన్ని స్థిరీకరించడం ద్వారా వాతావరణ మార్పును తగ్గించడం.

నెదర్లాండ్స్‌లో డెలాయిట్ నిర్వహించిన ఇటీవలి అధ్యయనం ప్రకారం.. రైతులందరినీ 100% సేంద్రియ సాగుకు మళ్లిస్తే పన్ను చెల్లింపుదారులు సంవత్సరానికి 1000 కోట్ల యూరోలు ఆదా చేయవచ్చని లెక్కగట్టింది. మరొక అధ్యయనం ప్రకారం.. వ్యవసాయాన్ని సేంద్రియం వైపు మళ్లిస్తే సరఫరా గొలుసులను ప్రమాదం నుంచి రక్షించవచ్చు. ఆహార భద్రతకు దోహదపడుతుంది.

## సేంద్రియం ప్రపంచాన్ని పోషించలేదనే విషయం నిజమేనా?

రసాయనిక వ్యవసాయంలో ఉత్పాదకత స్తబ్దుగా ఉండటంతో పాటు చాలా సవాళ్లు ఉన్నాయి. పంటల మార్పిడి పాటిస్తూ సేంద్రియ సాగు చేస్తే సాధారణ సాగుకు దీటుగా దిగుబడి వస్తుందని కెన్యాలోని చుకా, కందరాలలో జరిగిన దీర్ఘకాలిక అధ్యయనాలు నిరూపించాయి. బొలీవియాలోని అగ్రోఫారెస్ట్రీ కోకో పొలాల్లోనూ ఇది రుజువైంది.

## సేంద్రియ ఆహారం పర్యావరణానికి మేలేనా?

సేంద్రియ సాగు పద్ధతుల వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలు శాస్త్రీయ గణాంకాల ద్వారా ధృవీకరించబడ్డాయి. మల్చింగ్ వంటి సేంద్రియ పద్ధతులు భూమిని క్షీణింపజేయకుండా కాపాడుతాయి. మంచి దిగుబడిని ఇస్తాయని తేలింది. ఇంధన వినియోగం తగ్గి, నేల సారం పెరిగి పర్యావరణంపై సానుకూల ప్రభావం ఉంటుందని గణాంకాలు నిర్ధారిస్తున్నాయి.

## సేంద్రియ ఆహారం ఖరీదైనది. అందుబాటులో లేదన్నది నిజమేనా?

అమెరికా వాసుల (జనవరి 2025) అభిప్రాయం ప్రకారం సేంద్రియ ఉత్పత్తులు సాధారణ ఉత్పత్తుల కంటే సగటున 52% ఖరీదైనవి. ఒక ప్రాంతంలో రైతులందరినీ స్థానిక పంటలను, సీజన్‌కు అనువైన పంటలను సేంద్రియంగా పండించటాన్ని ప్రోత్సహిస్తే ప్రజలకు సేంద్రియ ఆహారం అందుబాటులోకి వస్తుంది. సరసమైన ధరకే అందించవచ్చు. స్థానికంగా పండించిన పంటలను స్థానికంగానే ప్రాసెసింగ్ చేసి అమ్మితే.. గ్రామీణ మార్కెట్లలో సేంద్రియ ఆహారం మరింత అందుబాటులోకి వస్తుంది. ఈ దిశగా ప్రయత్నం జరగాలి.

## సేంద్రీయ ఉత్పత్తుల ప్రభావం ఆరోగ్యంపై ఎలా ఉంటుంది?

ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుందనటానికి బలమైన ఆధారాలున్నాయి. సేంద్రియ ఆహార ఆరోగ్య ప్రయోజనాలను వినియోగదారులు, శాస్త్రవేత్తలు ఇద్దరూ గుర్తించారు. యూరోపియన్ ఫుడ్ సేఫ్టీ ఏజెన్సీ అధ్యయనం ప్రకారం.. సాధారణ ఆపిల్ పండ్ల కంటే సేంద్రియ ఆపిల్‌లు 19% అదనంగా ఆరోగ్యకరమైనవని తేలింది. నేషనల్ పెస్టిసైడ్ అబ్జర్వర్ సమాచారం ప్రకారం సేంద్రియ ఆహారానికి మారటం వల్ల మూత్రంలో గడ్డి మందు గ్లైఫొసేట్ అవశేషాలు గణనీయంగా తగ్గుతాయి.

# బిలియన్ డాలర్ల... భావోద్వేగాల బిజినెస్

పెట్ ఫ్రెండ్‌షిప్

ఒంటరి తనానికి డిజిటల్ స్నేహం

ఏఐ జంతువుల పెంపకంపై పెరుగుతున్న క్రేజ్

కేర్, కనెక్షన్, కంపానియన్‌షిప్ అన్నీ ఒకే యాప్‌లో

లాభాలు అందిస్తున్న ఎమోషనల్ ఎకానమీ

టెక్ స్టార్టప్‌లకు నెక్ట్స్ యూనికార్న్ సెగ్మెంట్

బిజినెస్ డెస్క్: భారత్‌లో ఇప్పుడు కొత్త తరహా డిజిటల్ స్నేహితులు అడుగుపెడుతున్నారు. ఏఐ ఆధారిత వర్చువల్ పెట్స్ (ఏఐ పెట్స్) యువతలో వేగంగా ఆదరణ పొందుతున్నాయి. నగర జీవనంలో పెరుగుతున్న ఒంటరితనం, నిజమైన పెంపుడు జంతువుల బాధ్యతలు తీసుకోలేని పరిస్థితుల్లో ఏఐ పెట్స్ ఒక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. భావోద్వేగంగా స్పందించడం, మాటలతో ఆదుకోవడం వంటి లక్షణాల వల్ల ఇవి యువతను ఆకర్షిస్తున్నాయి. వీటితో యూజర్లు నిజమైన జంతువును పెంచుకుంటున్న అనుభూతి పొందుతారు. వీటితో కూడా రోజువారీ రొటీన్‌ను ఫాలో అవచ్చు. ఆహారం పెట్టడం, స్నానం చేయించడం, ఆడించడం, నిద్ర షెడ్యూల్ చూసుకోవడం వంటి పనులు చేస్తూ నిజమైన పెంపుడు జంతువును ఆడించినట్లే ఆనందిస్తారు. ఈ పెట్ అప్లికేషన్లలో వినియోగదారులు తమ పెంపుడు జంతువుకు దుస్తులు, ఆభరణాలు కొనుగోలు చేయవచ్చు. నెలకు సగటున రూ. 30 నుంచి రూ. 60 వరకు ఖర్చు చేస్తూ, ఆ ఏఐ పెట్‌ను సంరక్షించడం, శిక్షణ ఇవ్వడం, భావోద్వేగంగా స్పందించేలా నేరి?పంచడం చేస్తున్నారు.

## పెరుగుతున్న మార్కెట్


వర్చువల్ పెట్స్ మార్కెట్ విలువ ప్రస్తుతం సుమారు 150 మిలియన్ డాలర్లని అంచనా. వెంచర్ క్యాపిటలిస్టులు ఈ రంగం 35--40 శాతం వార్షిక వృద్ధితో బిలియన్ డాలర్లకు చేరుతుందని ఊహిస్తూ అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ యాప్‌లు ప్రధానంగా సబ్‌స్క్రిప్షన్లు,ఇన్--యాప్ కొనుగోళ్లు, పెట్ యాక్సెసరీస్ ద్వారా ఆదాయం పొందుతున్నాయి.

## భవిష్యత్తు ఎలా ఉంటుంది?


వాయిస్ ఆధారిత ఇంటరాక్షన్, మల్టీప్లేయర్ ఫీచర్లు, వివిధ లొకేషన్లలో పెట్స్‌ను కలుసుకునే అవకాశాలతో ఈ రంగం మరింత విస్తరిస్తోంది. అయితే ఏఐ పెట్స్ టెక్నాలజీ నిజమైన మానవ సంబంధాల నుంచి మనుషులను దూరం చేస్తుందని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

## టమాగోచ్చి నుంచి ఏఐ వరకు

వాస్తవానికి డిజిటల్ పెట్స్ కాన్సెప్ట్ కొత్తది కాదు. జపాన్‌లో 1990లలో వచి?చన టమాగోచ్చి వీడియో గేమ్ వర్చువల్ పెట్స్‌కు బాట వేసింది. ఆ తర్వాత 2000లలో టాకింగ్ టామ్, ఫ్రెండ్స్ యాప్స్, విడ్జెట్స్ వంటి అప్లికేషన్లు పాపులర్ అయ్యాయి. ఇప్పుడు ఏఐ టెక్నాలజీతో ఈ వర్చువల్ పెట్స్ మరింత అడ్వాన్స్‌డ్‌గా మారాయి. పాకెట్ పెట్, క్రిప్టో కిట్టీస్, జూమీ వంటి యాప్‌లు యూజర్లు తమ ఊహలకు అనుగుణంగా పెంపుడు జంతువులను సృష్టించుకునే అవకాశం ఇస్తున్నాయి.



## అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడులు



రియాద్ : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఉన్న అమెరికన్ ఎంబసీపై డ్రోన్ దాడి జరిగింది. ఒక్కసారిగా పెద్ద శబ్ధం రావడంతో అక్కడున్న స్థానికులు భయంతో పరుగులు తీశారు. పశ్చిమాసియా ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీనికి సంబంధించి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇరానే ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సౌదీ అరేబియా రక్షణ శాఖ కూడా స్పందించింది. రెండు డ్రోన్లతో దాడులు జరిగినట్లు వెల్లడించింది. అక్కడ మంటలు చెలరేగడంతో కొద్దిపాటి నష్టం జరిగినట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా ... ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎంబసీలు, వైమానిక స్థావరాలపై దాడులు చేస్తున్నాయి. దీంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతోంది. అయితే ఈ దాడులు ప్రాంతీయ ఘర్షణకు దారితీసే ప్రమాదముందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉద్రిక్త పరిస్థితులను దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సౌదీ అరేబియా, ఖూజు, ఖతర్, బహ్రెయిన్ రాజులతో పుతిన్ సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, మరో 40 మందికి పైగా సీనియర్ నేతలు చనిపోయారు. మరోవైపు ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు.

## ప్రధాని మౌనం భారత్ ఖ్యాతిని దిగజారుస్తోంది




న్యూఢిల్లీ : అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. "భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం" అని అన్నారు. "భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలి" అని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

## ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వ మౌనంపై సోనియాగాంధీ ఆగ్రహం



న్యూఢిల్లీ : ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బడ్జెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసపినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

## హార్ముజ్ జలసంధిని మూసివేశాం : ఇరాన్



కైరో : హార్ముజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపైనైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ సోమవారం ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# ఖమేనీ అంతానికి... ఎందుకంత పంతం?

## సుప్రీం నేతతో అమెరికాది దశాబ్దాల వైరం



ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీతో అమెరికా వైరం దశాబ్దాల నాటిది. దీని మూలాలు ఇరాన్‌లో అపార చమురు నిక్షేపాల్లో దాగున్నాయి. 1950వ దశకంలో ఇరాన్ ప్రధాని మొహమ్మద్ మొసాదేగ్‌ను బ్రిటన్, అమెరికాలు 'ఆపరేషన్ బూట్' పేరుతో జరిగిన సైనిక తిరుగుబాటుతో గద్దె దించాయి. అంతకుముందు వరకు దశాబ్దాలు పరిపాలించిన రాజు మొహమ్మద్ రెజా పహ్లావీని మళ్లీ గద్దెనెక్కించాయి. కానీ అనూహ్యంగా కొంతకాలానికే రుహెుల్లా ముసావీ ఖొమేనీ సారథ్యంలో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తలెత్తింది. అనంతరం ఆయన మరణంతో అధికార పగ్గాలు ఖమేనీ చేతికొచ్చాయి. నాటినుంచీ అమెరికాకు ఆయన కొరకరాని కొయ్యగా తయారయ్యారు. పశ్చిమాసియాపై పెత్తనం చేయడానికి అమెరికా చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఖమేనీ తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. పశ్చిమాసియాను అమెరికాకు వ్యతిరేక శక్తిగా మార్చేందుకు అవిశ్రాంతంగా కృషిచేశారు. అమెరికా కుయుక్తులను తన రాజకీయ చాణిక్యంతో తుత్తునియలు చేశారు. ఇరాన్‌కు తోడుగా పాలస్తీనా భూభాగంలో హమాస్‌ను, యెమెన్‌లో హూతీలను, లెబనాన్‌లో హెజ్‌'ల్లా ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ తన ఆధిపత్యాన్ని బలపర్చుకున్నారు. దాంతో ఖమేనీ ఆధిపత్యానికి గండికొట్టేందుకు అమెరికా శతథా ప్రయతీ?నంచింది. ఇరాన్‌లో నిఘాను పెంచి సైబర్ దాడులు చేయించి, సున్నీలను రెచ్చగొట్టి తిరుగుబాటు లేవదీసి... ఇలా పలు రకాలుగా ప్రయతీ?నంచి విఫలమైంది. ఖమేనీ పాలనకు చరమగీతం పాడేందుకు అమెరికా ఎన్నోసార్లు కోవర్ట్ ఆపరేషన్లు కూడా చేసింది. వాటికి సంబంధించిన ఆధారాలు లభించిన ప్రతిసారీ తనకేం సంబంధం లేదని బుకాయించింది. ఇస్లామిక్ విప్లవం వేళ 1979లో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై విప్లవకారులు దాడిచేసి పలువురు దౌత్యవేత్తలు, సిబ్బందిని బంధించారు. వాళ్లను విడిపించేందుకు అమెరికా విశ్వప్రయత్నంచేసింది. ఆ విప్లవం తర్వాత ఇరాన్‌లో ఏర్పడిన మత రాజ్యాన్ని అస్థిరపరిచేందుకు అమెరికా స్థానిక తిరుగుబాటుదారులకు సాయపడింది. ముజాహిదీన్--ఇ--ఖల్ఫ్ (ఎంఈకే)కు ఆర్థికసాయం చేసింది. సున్నీ ఉగ్రవాద సంస్థ జూన్‌దుల్లాకు అండదండలు అందించింది. ఇరాన్ ప్రభుత్వ నేతలు, కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పింది. మతపాలకుల పరువు పోగొట్టేందుకు పుకార్లను షికార్లు చేయించేది. అబద్ధాలను విస్తృతంగా ప్రచారం చేయించేది. ఇరాన్‌లో సైబర్, నిఘా ఆపరేషన్లనూ విస్తృతపరిచింది. అణు పరిశోధనలు కొనసాగకుండా తరచూ ఆటంకపరిచేది. ఈ విషయంలో అమెరికాకు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ సైతం తనవంతు సాయం చేసింది.

## వేదకాలం నుంచి నేటి కాలం వరకు.. విదుషీమణులు



ప్రాచీన కాలంలో, అంటే క్రీ.పూ.3000 సంవత్సరాల ముందు కాలం నుండీ కూడా మన దేశం 'స్త్రీ విద్య' ను ప్రోత్సహించి, గౌరవించింది. ఆనాటి నుండీ స్త్రీలు లౌకిక, అలౌకిక విద్యలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. వేదకాలంలోనే మహిళలు ఉపనయన సంస్కారాలు పొంది, వేదాధ్యయనం చేశారు. వేద మంత్రాలు దర్శించారు. తపస్వినులు, ఆధ్యాత్మికవేత్తలైన స్త్రీలను 'ఋషికలు' అంటారు. రోమశ, గార్గి వాచక్నవి, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, మైత్రేయి, అపాల, యామి, పౌలోమి, ఘోష, ఖోన, జుహు, వాగంభ్రణి, సావిత్రి, దేవజామి, కక్షివతి, దక్షిణ ప్రజాపత్య, విశ్వావతి, పశుక్రపత్ని, దేవసూని, శాశ్వతి, అంగీరసి, శ్రీ లక్ష్మి, నోధ, శిఖతన్వరి, గౌపాయన, ఉభయభారతి, విజ్జిక, కామాక్షి వంటి స్త్రీలందరూ ఋషికలే. గృహజీవనానికి స్త్రీయే పునాది అని ఋగ్వేదం చెప్పింది. శక్తిస్వరూపిణి అయిన స్త్రీని గౌరవించి, ఆరాధించే సంస్కృతి మనది. పరబ్రహ్మంలోని స్త్రీ పరమైన గుణాలు, శక్తులు కలిసి 'స్త్రీ దేవతలు' అవతరించారు. వారి గురించి తెలుసుకుందాం.

లోపాముద్ర: అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర సంస్కృత, తమిళ భాషలలో నిష్ణాతురాలు. లోపాముద్ర అంటే తనలో తానే లీనమైన ఆత్మనిష్ఠాపరురాలు అని అర్థం. అగస్త్యునికి, లోపాముద్రకు మధ్య జరిగిన సంవాదం, లోపాముద్ర పాండిత్యం, గెలుపును ఋగ్వేదం ప్రశంసించింది. అగస్త్యుడు, లోపాముద్ర సాహచర్యంలో సంవాదాలలో భౌతిక, ఆధ్యాత్మిక జీవితంలోని పవిత్రతను, పూర్ణత్వాన్ని గ్రహించాడని చెబుతారు.

ఘోష: ఆమె దుర్గతమసుని మనుమరాలు. కక్షివంతుని కూతురు. దేవ వైద్యులైన అశ్వనీ కు మారులను స్తుతిస్తూ ఆ తండ్రీ కుమా రులు అనేక శ్లోకాలు రచించారు. పదవ ప్రకరణంలోని కొన్ని శ్లోకాలను తండ్రి, తాతగార్లతో సమానంగా ఘోష రచించింది. వాటిలోని ఒక శ్లోకంలో ఆమె అశ్వినులను వివాహం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడిస్తుంది. కుష్ఠువ్యాధిచే కురూపి అయిన ఆమెను అశ్వనీ దే వతలు తమ వైద్యంతో ఆరోగ్యవంతు రాలిని, అందగత్తెను చేసి పెండ్లి చేసు కొంటారు.

ఋగ్వేద మంత్ర ద్రష్ట మైత్రేయి: గొప్ప తాత్వికురాలు, ఋషిక అయిన మైత్రేయి కూడా ఋగ్వేద మంత్రాలను దర్శించింది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక ఆలోచనలను పరిణితి చెందేలా చేయడంలో ప్రధానపాత్ర వహించింది. యాజ్ఞవల్క్యునికి కాత్యాయని అనే రెండవ భార్య కూడా ఉంది. ధర్మశాస్త్రాలు, వేదాలు బాగా చదివి, బ్రహ్మవాదినిగా మైత్రేయి ఘనత వహిస్తే, కాత్యాయని ఒక సాధారణ ఇల్లాలిగానే ఉండింది. ప్రాపంచిక చింతనలు విడిచి, సన్యాసికి అనువైన స్వీయ నియంత్రణ, సన్యాసి ప్రతిజ్ఞా పాలన చేయదలచి యాజ్ఞవల్క్యుడు ఒకరోజు తన ప్రాపంచిక ఆస్తిపాస్తులను తన ఇద్దరు భార్యలకు పంచదలిచాడు. ప్రపంచ సంపద తనకు శాశ్వతత్వాన్ని, ముక్తిని ఇవ్వలేదని భావించి మైత్రేయి తన భర్త నుండి కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ముముక్షత్వానికి కావలసిన శిక్షణను కోరుకొని మరీ పొందింది.

బ్రహ్మజ్ఞాని గార్గి: వాచక్న మహర్షి కూతురు, వైదిక ప్రవక్త గార్గి. మానవ అస్తిత్వానికి, ఉనికికి, జీవితానికి మూలమేమిటి అనే అంశంపై గార్గి అనేక వేదమంత్రాలను దర్శించింది. ఎందరో వేదాంత వేత్తలను వాదంలో గెలిచిన యాజ్ఞవల్క్యునికి ఆత్మానాత్మల విచారం గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి అనేక ప్రశ్నలను సంధించి గార్గి ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది.

గొప్ప విజ్ఞాని ఉభయభారతి: మధ్యయుగంలో తత్వవేత్త, మీమాంస, అద్వైత దర్శనాలలో ప్రవీణుడైన మండనమిశ్రుని భార్య అయిన ఉభయభారతి ఒక గొప్ప విజ్ఞాని. శ్రీ ఆదిశంకరాచార్యులకు, మండనమిశ్రునికి మధ్య జరిగిన అద్వైత సిద్ధాంత సంబంధిత వాదోపవాదాలకు ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. పక్షపాత రహితంగా ఆ వాదనలలో తన భర్తను కాక, ఆదిశంకరులనే విజేతగా ప్రకటించిన విదుషీమణి ఆమె.

ఆళ్వార్ ఆండాళ్: ఇంకా ఆ యుగంలో 'తిరుప్పావై' అనే భక్తి గీతాలను వ్రాసిన మొదటి మహిళా ఆళ్వార్ అండాళ్. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వంపై కవితలు వ్రాసిన కర్నాటకలోని శివ భక్తురాలు అక్క మహాదేవి. రాజస్థాన్ లోని కృష్ణ భక్తురాలు, సాంఘిక దురాచారాలను ప్రతిఘటించిన కవయిత్రి మీరాబాయి, సరళ భాషలో వేదాంతపరమైన నిగూఢార్థాలు చాటిచెప్పిన తత్వవేత్త లాలాదేవి, గ్రామీణుల సాధారణ జ్ఞానాన్ని వేదాంత విజ్ఞానంతో అనుసంధిస్తూ రచనలు చేసిన తమిళ కవయిత్రి అవ్వయ్యార్, ఇంకా సక్కుబాయి, ముక్తాబాయి, మదాలస, ఈ మధ్యకాలంలో తరిగొండ వెంగమాంబ, ఆదోని లక్ష్మమ్మ, జిల్లెళ్ళమూడి అనసూయమ్మ మొదలైన యోగినులు, అంతర్బుద్ధి సిద్ధులైన మహిళలు ఎందరో ఉన్నారు.

విజ్జిక: దండి మహాకవి తన ఒక రచనలో సరస్వతీ దేవిని తెలుపు దేహరంగు ఛ్చాయ కలదిగా వర్ణించాడు. విజయాంబిక (విజ్జిక) అనే కవయిత్రి నలుపురంగుతో ఉండేది. ఆమె దండి అభిప్రాయాన్ని ప్రతిఘటించింది. నల్లని దేహకాంతిగల అపర సరస్వతినైన నా గురించి తెలుసుకోకుండా సరస్వతి ధవళవర్ణిని అని దండికవి ఎలా అంటాడని ఆమె ప్రశ్నించింది. స్త్రీల ఆత్మవిశ్వాసానికి విజ్జిక ఒక ప్రతీక. ఇంకా గంగాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు రసవత్తర కావ్యాలు వెలువరించి పురుషులతో సమానంగా నిలిచినవారే.

ఆధ్యాత్మిక వేత్త గౌతమి: బౌద్ధయుగంలో గౌతమ బుద్ధుని పెంపుడు తల్లి అయిన మహా ప్రజావతి గౌతమి ఒక ఆధ్యాత్మికవేత్త. ఆమె కాక బౌద్ధ వేదాంత ధ్యాన సన్యాసినులు ఖేమ, ఉప్పలావన, రెండవ భాస్కరుని కూతురైన లీలావతి వంటి ఆధ్యాత్మిక వేత్తలైన స్త్రీలుండేవారు.

## చందమామ చిక్కేదెవరికి?

### మానవసహిత ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్న చైనా
### అమెరికాకు పోటీగా పరిశోధనలు
### ఒక్కసారిగా పెరిగిన అంతరిక్ష పరిశోధనల పోటీ



దశాబ్దాల తర్వాత జాబిల్లిపై అమెరికా దృష్టిసారించిన మరుక్షణమే చైనా సైతం తన అంతరిక్ష పరిశోధనలకు చందమామను కేంద్రస్థానంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాకెట్లు, వ్యోమనౌకలు, ల్యాండర్‌లతో రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. 2028కల్లా చంద్రునిపై 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్'ద్వారా మానవసహిత ప్రయోగాలను పునరుద్ధరించాలని అమెరికా ప్రణాళికలు రచించింది. ప్రతిరంగంలో అమెరికాతో పోల్చుకుని ఆ దిశగా పావులు కదిపే చైనా ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష వనరులు, దేశ ప్రయోజనాలే పరమావధిగా ముందడుగు వేస్తోంది. దీంతో ఒక్కసారిగా చంద్రుని కేంద్రంగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పోటీకి తెరలేచింది.

### చైనా ఎలా సంసిద్ధమవుతోంది?

మానవసహిత ప్రయాణాలు సాధ్యమయ్యేలా అత్యంత శక్తివంతమైన లాంగ్ మార్చ్--10 రాకెట్‌ను చైనా అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన తక్కువ కాలానికి ఇంజిన్‌ను పూర్తి లేదా పాక్షిక సామర్థ్యంతో మండించడం(క్రిటికల్ స్టాటిక్ ఫైర్), ప్రయోగశాలలో రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షించడం(లో ఆతీ?టట్యూట్ డెమోన్?రస్ట్రేషన్ టెస్ట్)లను విజయవంతంగా పూర్తిచేసింది. వ్యోమగాములను మోసుకెళ్లే పునర్ వినియోగ క్యాపరీ?ుయల్ 'ది మెంగ్‌జోయూ'ను చైనా పరీక్షిస్తోంది. ఈ క్యాప్సూల్‌తో డైనమిక్ ప్రెషర్ విధానంలో వ్యోమగాములు తప్పించుకునే టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి వ్యోమనౌక గాల్లోకి లేచేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం లాంటివి జరిగితే వ్యోమగాములు తప్పించుకునే మ్యాక్స్ క్యూ అబోర్ట్ టెస్ట్‌నూ విజయవంతంగా పరీక్షించింది. చైనా వ్యోమగాములు(టైకోనాట్స్)ను చందమామ ఉపరితలం మీదకు తీసుకెళ్లే తిరిగి కక్ష్యలోకి తీసుకొచ్చే 'ది లాన్యే లూనార్'ల్యాండర్‌నూ చైనా పరీక్షిస్తోంది. లాన్యే అంటే చందమామను హత్తుకోవడం. ఈ పదాన్ని మావో జెడాంగ్ తన కవితలో తొలిసారిగా ఉపయోగించారు. సిమ్యులేషన్ సమయంలో ఈ ల్యాండర్.. ల్యాండింగ్, టేకాఫ్‌లను అత్యంత ఖచ్చితత్వంతో పూర్తిచేసిందని చైనా ఇటీవలే ప్రకటించింది. చందమామపైకి లాంగ్ మార్చ్--10 రాకెట్ పలు మార్లు ప్రయోగాలకు అనువుగా ప్రయోగవేదికలను విస్తరిస్తున్నారు. లాంచ్‌ప్యాడ్లు, ట్రాకింగ్ స్టేషన్లు, అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో హైనాన్‌లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్‌సైట్‌లో నిర్మాణపనులు వేగవంతమయ్యాయి. వ్యోమగా ములతో కూడిన డీప్--స్పేస్ ఆపరేషన్ల కోసం ఇతర కీలక వసతులను అందుబాటులోకి తెస్తున్నారు.

### చందమామ మీదకు వెళ్లేది ఎప్పుడు?

మరో నాలుగేళ్లలో తొలి వ్యోమగాముల బృందాన్ని చందమామ మీద దింపాలని చైనా లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ షెడ్యూల్ ప్రకారం చకచకా జరుగుతున్నాయని 'ది చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ'ప్రకటించింది. "ప్రయోగ పరీక్షలు అన్నీ విజయవంతమవుతూ, మౌలికసదుపాయాల కల్పన పూర్తవుతూ లక్ష్యాన్ని చేరువచేస్తున్నాయి. అంతరిక్ష చరిత్రలో సరికొత్త మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నాం"అని స్పేస్ ఏజెన్సీ పేర్కొంది.

### ఈ ఏడాది బిజీబిజీ..

2026లో బిజీ షెడ్యూల్‌తో చైనా దూసుకుపోతోంది. సొంతంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం 'తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్'కు రెండు సార్లు వ్యోమగాములను పంపనుంది. సరకులను పంపేందుకు ఒక ప్రయోగం చేయనుంది. ఒక టైకోనాట్‌ను ఒక పూర్తి ఏడాదికాలం అక్కడే ఉంచనుంది. తద్వారా సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు? అనే అంశంపై అధ్యయనంచేయనుంది. కొత్త మాడ్యూళ్లను తీసుకెళ్లేందుకు హాంకాంగ్, మకావూ నుంచి ఇద్దరు టైకోనాట్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపనుంది. పాకిస్తాన్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వ్యోమగాములకు చైనా స్పేస్‌స్టేషన్ స్వాగతం పలకనుంది.

### నాసా మిషన్‌లో వచీ?చన మార్పులేంటి?

2027లో దిగువ కక్ష్యలో తొలుత ఒక వ్యోమనౌకను ప్రయోగించనుంది. వాణిజ్య ల్య?ుయడర్లతో అనుసంధానం కోసం రిహార్సల్ చేయనుంది. ఈ కమర్షియల్ ల్యాండర్లను స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు రూపొందిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్టిమిస్--2 ప్రాజెక్ట్‌ను అమెరికా చేపట్టనుంది. వ్యోమగాములతో బయల్దేరే వ్యోమనౌక చంద్రుని సమీప కక్ష్యలోకి వెళ్లి అక్కడి నుంచి జాబిలి సమాచారాన్ని సేకరిస్తుంది. చంద్రుని స్వల్ప గురుత్వాకర్షణ శక్తినే వడిసెలా వాడుకుని తిరిగి భూమి దిశలో పయనించనుంది. 2027లో ఆర్టిమిస్--3 ఆ తర్వాత 2028లో ఆర్టిమిస్--4ను అమలుచేయనుంది.

### మళ్లీ చందమామపై దృష్టి ఎందుకు సారించారు?

చంద్రుని దక్షిణ ధృవంలోని బిలాల్లో ఘనరూప నీరు ఉందని తాజా పరిశోధనలు బలంగా చెబుతున్నాయి. ఈ నీటిని ఉపయోగించుకుని అక్కడ వ్యోమగాముల కోసం స్థిరనివాసాలు ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తోంది. అక్కడి నుంచి అంతరిక్ష ప్రయోగాలు చేయాలని ఆశిస్తోంది. అరుణ గ్రహంపై యాత్రకు జాబిలిని మజిలీగా మార్చుకోవాలని భావిస్తున్నారు. హీలియం--3 అనే అరుదైన ఐసోటోప్ చందమామపై సమృద్ధిగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వ్యోమగాములు అక్కడ స్థిరపడ్డాక ఈ ఐసోటోప్‌తో కేంద్రక సంలీన చర్య ద్వారా నిరంతరాయంగా కరెంట్‌ను ఉత్పత్తిచేసి విద్యుత్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# మామ్2.. ఖుషీకి అగ్నిపరీక్ష, లెగసీకి కొత్త అధ్యాయం



దాదాపు తొమ్మిదేళ్ల క్రితం రిలీజైన మామ్ మూవీ బాలీవుడ్‌లో భావోద్వేగ ప్రధాన చిత్రంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా శ్రీదేవి తన కెరీర్‌లో అత్యంత ప్రశంసలు అందుకున్న ప్రదర్శనగా ఈ సినిమా నిలిచింది. ఇప్పుడదే సినిమాకి సీక్వెల్ రూపంలో మామ్2 సెట్స్‌పైకి రావడంతో, ఫ్రాంచైజ్‌పై మళ్లీ ఆసక్తి పెరిగింది. అయితే ఈసారి ఫోకస్ పూర్తిగా కొత్త తరం వైపు మళ్లింది. లవ్ యాపా సినిమాలోని యాక్టింగ్ కు విమర్శలు మామ్2లో మెయిన్ లీడ్ గా శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ కనిపించనుంది. ఇప్పటికే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమెకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. ఖుషీ గత సినిమా లవ్ యాపా రిలీజ్ టైమ్ లో ఆమె యాక్టింగ్ పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. స్క్రీన్ ప్రెజెన్స్, ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో ఇంకా ఇంప్రూవ్‌మెంట్ అవసరమని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మామ్2 ఆమె కెరీర్‌కు నిజమైన టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న చర్చ మొదలైంది. భావోద్వేగంతో పాటు బలమైన న్యాయపరమైన కథనం ఉండే ఈ ఫ్రాంచైజ్‌లో ఆమె పెర్ఫార్మెన్స్ ఆడియన్స్ అంచనాలను అందుకోగలదా అన్నది ఆసక్తికరంగా మారింది.




### బోనీ కపూర్ ఎమోషనల్ డెసిషన్

ఇదే సమయంలో నిర్మాతగా బోనీ కపూర్ తీసుకున్న నిర్ణయం కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. తన భార్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన సినిమాకి సీక్వెల్ రూపొందించడం ఒకవైపు భావోద్వేగపూరిత నిర్ణయం అయితే, మరోవైపు వ్యూహాత్మక అడుగుగా కూడా చూడవచ్చు. మామ్ బ్రాండ్‌కు ఉన్న ఎమోషనల్ వాల్యూని కొనసాగిస్తూ, ఈ జెనరేషన్ హీరోయిన్ తో ఫ్రాంచైజ్‌ను విస్తరించాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం సీక్వెల్ మాత్రమే కాదు, ఒక లెగసీని కొత్త దిశలో నడిపించే ప్రయత్నం అని ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### పోలికలు తప్పవు

అయితే, ఈ ప్రాజెక్ట్ ముందున్న అతిపెద్ద సవాలు పోలికల ఒత్తిడి. శ్రీదేవి లాంటి లెజెండరీ నటి చేసిన సినిమాను ఇప్పుడు వేరే వారు చేస్తున్నప్పుడు కంపేరిజన్ ఆటోమేటిక్ గా వస్తుంది. ఆమె సృష్టించిన ఎమోషనల్ ఎఫెక్ట్ ప్రేక్షకుల మదిలో ఇంకా సజీవంగానే ఉంది. అలాంటి నేపథ్యంలో ఖుషి నటనను అదే ప్రమాణాలతో కొలవడం సహజం. ఫ్రాంచైజ్‌కు ఉన్న వారసత్వం ఒకవైపు బలం అయితే, మరోవైపు అదే అంచనాల భారంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మామ్2 సక్సెస్ కేవలం గత జ్ఞాపకాలపై ఆధారపడదు. కథనం బలం, దర్శకత్వ దృష్టి, ముఖ్యంగా ఖుషి ప్రదర్శన.. ఈ మూడు అంశాలపై ఫలితం ఆధారపడనుంది. లెగసీని గౌరవిస్తూ, కొత్త అధ్యాయాన్ని విజయవంతంగా ప్రారంభించగలిగితేనే ఈ సీక్వెల్ నిజమైన అర్థంలో సక్సెస్‌గా నిలుస్తుంది. లేదంటే, ఇది కేవలం ఎమోషనల్ ఎక్స్‌పెరిమెంట్‌గానే మిగిలిపోవచ్చు.




# డిజిటల్ యుగంలో కమల్- రజినీ 'ఫిల్మ్' సాహసం!

తమిళ సినీ ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశంగా మారిన కమల్‌హాసన్, రజినీకాంత్ రీయూనియన్ ప్రాజెక్ట్ ఇప్పుడు మరో ఆసక్తికరమైన మలుపు తీసుకుంది. ప్రస్తుతానికి ఖ౦×=ఖగా పిలుస్తున్న ఈ సినిమాను పూర్తిగా సంప్రదాయ ఫిల్మ్ కెమెరాలతో తెరకెక్కించే యోచనలో డైరెక్టర్ నెల్సన్ ఉన్నారన్న సమాచారం ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీసింది. డిజిటల్ ఆధిపత్యం కొనసాగుతున్న ఈ రోజుల్లో మళ్లీ ఫిల్మ్ రీల్స్ వైపు తిరగడం కేవలం టెక్నికల్ డెసిషన్ మాత్రమే కాదు, దాన్నొక వింటేజ్ స్టేట్‌మెంట్‌గా కూడా భావిస్తున్నారు. నాస్టాల్జిక్ మూడ్ ను తీసుకురావాలని ప్రయత్నం 80స్, 90స్ కాలంలో సినిమాలు పూర్తిగా ఫిల్మ్‌పై తెరకెక్కేవి. ఆ కాలపు విజువల్ టెక్స్చర్, నేచురల్ గ్రెయిన్, లైట్ ఫాల్ ఆఫ్, కలర్ డెప్త్.. ఇవన్నీ కలిపి ఒక ప్రత్యేకమైన నాస్టాల్జిక్ అనుభూతిని కలిగించేవి. అదే మూడ్‌ను తిరిగి స్క్రీన్‌పైకి తీసుకురావాలన్న ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని చూడొచ్చు. ముఖ్యంగా కమల్, రజనీ లాంటి లెజెండ్స్‌తో ఈ ప్రయోగం చేయడం ఆ జెనరేషన్‌కు ఒక భావోద్వేగ అనుసంధానాన్ని సృష్టించే అవకాశం ఉంది. అనుకున్నంత ఈజీ కాదు అయితే, ఈ వింటేజ్ ప్రయత్నం అంత సులభం కాదు. ఫిల్మ్‌పై షూటింగ్ అంటే ఖర్చు ఎక్కువ, ప్రతి షాట్‌కు పరిమిత అవకాశాలు, రీటేక్స్ ఖర్చు, అలాగే ప్రాసెసింగ్ టైమ్ నుంచే ఎన్నో సవాళ్లు ఉంటాయి. డిజిటల్‌లో లభించే ఇన్‌స్టంట్ మానిటరింగ్, ఈజీ ఎడిటింగ్ ఫ్లెక్సిబిలిటీ ఇక్కడ ఉండదు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో కూడా సమయం, ఖచ్చితత్వం మరింత అవసరం అవుతుంది. ప్రస్తుత ప్రొడక్షన్ సిస్టమ్ బాగా



వేగవంతమైన నేపథ్యంలో ఈ విధానం ఎంతవరకు ప్రాక్టికల్‌గా ఉంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక సినిమాటోగ్రఫీ పరంగా చూసుకున్నా కూడా ఈ డెసిషన్ మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్ రాజీవ్ మెనన్ లాంటి వ్యక్తి ఫిల్మ్ ఫార్మాట్‌ను ఎంచుకుంటే, అది కేవలం స్టైల్ కోసం కాదని, ఒక ప్రత్యేక విజువల్ లాంగ్వేజ్ కోసమని అర్థం చేసుకోవచ్చు. ఫిల్మ్ కెమెరాల ద్వారా వచ్చే డైనమిక్ రేంజ్, స్కిన్ టోన్స్ సహజత్వం, లైట్ షాడో డెప్త్ ఈ సినిమాకు క్లాసిక్ విజువల్ టోన్‌ను ఇవ్వవచ్చు. ఇది సాధారణ కమర్షియల్ సినిమాల నుంచి భిన్నమైన అనుభూతిని అందించే అవకాశముంది. ఇక పాన్-ఇండియా కోణంలో చూస్తే, ఈ ప్రయోగం సక్సెస్ అయితే భారతీయ సినీ పరిశ్రమలో ఒక కొత్త చర్చకు నాంది కావచ్చు. డిజిటల్ వర్సెస్ ఫిల్మ్ అనే డిబేట్ మళ్లీ తెరపైకి రావచ్చు. ఇతర పెద్ద దర్శకులు కూడా హైబ్రిడ్ లేదా పూర్తి ఫిల్మ్ మోడల్‌పై ఆలోచించే పరిస్థితి ఏర్పడొచ్చు. అయితే, ఇక్కడే బజ్ వర్సెస్ రియాలిటీ ప్రశ్న ముందుకు వస్తుంది. ప్రారంభ దశలో ఫిల్మ్ కెమెరాలతో షూట్ చేయాలన్న ఆలోచన ఉన్నా, ప్రాక్టికల్ పరిమితుల కారణంగా చివరికి హైబ్రిడ్ మోడల్‌ను ఎంచుకునే అవకాశం కూడా లేకపోలేదు. భారీ అంచనాల నడుమ ఈ నిర్ణయం ఎంతవరకు అమలు అవుతుందన్నది చూడాల్సిందే. మొత్తంగా చూస్తే, కమల్-రజనీ రీయూనియన్ కేవలం స్టార్ పవర్ ఈవెంట్ మాత్రమే కాకుండా, భారతీయ సినీ సాంకేతికతలో ఒక వింటేజ్ ప్రయోగంగా నిలిచే అవకాశమున్న ప్రాజెక్ట్‌గా మారుతోంది. ఈ సాహసం ఎంతవరకు సక్సెస్ అవుతుందో రాబోయే రోజులు నిర్ణయించనున్నాయి.

# హీరోయిన్లు రైటర్లు అవుతోన్న వేళ!





వెండి తెరపై హీరోయిన్లు మాత్రమే కాదు. అవసరం మేర కలం పట్టి రచయితలు అయిన నటీమణులు కొందరున్నారు. భానుమతీ రామకృష్ణ తెలుగు సినిమా చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలి. భానుమతి కేవలం హీరోయిన్ మాత్రమే కాదు.. రచయిత్రి గాను సేవలందించారు. తన ఆత్మకథ 'నాలో నేను' తో పాటు అనేక కథలు, పాటలు రాశారు. ఆమె రాసిన 'అత్తగారి కథలు' అప్పట్లో ఎంతో ప్రసిద్ధి. బాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించారు హనీ ఇరానీ. అటుపై హీరోయిన్ గా, అనంతరం ఇండియాలోనే టాప్ స్క్రీన్ రైటర్లలో ఒకరిగా ఎదిగారు.'లమ్హే', 'ఐనా', 'దర్', 'కహో నా ప్యార్ హై', 'క్రిష్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు కథలు అందించారు. ప్రస్తుత కాలంలో అత్యంత ప్రతిభావంతురాలైన నటి కొంకణా సేన్. 'ఏ డెత్ ఇన్ ద గంజ్' సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సౌత్ లో ఒకప్పుడు టాప్ హీరోయిన్ గా కొనసాగిన సుహాసిని మణిరత్నం కూడా రచయిత్రిగా ముద్ర వేసారు. 'తిరుడా తిరుడా', 'ఇద్దరు' సినిమాలకు డైలాగ్స్ రాయడంలో సహకరించారు. బాలీవుడ్ హీరోయిన్ కంగన రనౌత్ కూడా రైటర్ గా, దర్శకురాలిగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. కల్కి కొచ్లిన్ వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్ మాత్రమే కాదు రచయిత్రిగా కూడా గుర్తింపు పొందారు. 'ద గర్ల్ ఇన్ ఎల్లో బూట్స్' సినిమాకు కో-రైటర్‌గా పని చేశారు. వీరి బాటలోనే నవతరం నటీమణులు కెరీర్ ని నిర్దేశించుకుని ప్రయాణం ముందుకు సాగిస్తున్నారు. కీర్తి సురేష్ ఇప్పటికే సౌత్ లో ఎన్నో సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. బాలీవుడ్ లో కూడా అవకాశాలు అందుకుంటుంది. అంతేనా కెప్టెన్ కుర్చీ ఎక్కడానికి అమ్మడు సిద్ధమవుతుంది. ఈ క్రమంలో సొంత కథలు రాయడం మొదలు పెట్టింది. సరైన కథ సిద్ధమైన తర్వాత దర్శకురాలిగానూ మారడానికి రెడీ అవుతోంది. అలాగే సమంత సొంతంగా నిర్మాణ సంస్థను స్థాపించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా డైరెక్షన్ , రైటింగ్ టీమ్తో ఎన్నో స్క్రిప్ట్ డిస్కషన్స్ లో పాల్గొంటుంది. అవసరమైన సూచనలు, సలహాలు క్రియేటివ్ గా అందించే ప్రయత్నం చేస్తుంది. తాను కూడా సొంతంగా కథలు రాసే ఆలోచనలో ఉంది. మల్టీ ట్యాలెంటెడ్ బ్యూటీ శ్రుతి హాసన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. నటిగా, గాయనిగా, మ్యూజిషియన్ గా సత్తా చాటుతుంది. అవసరం మేర సాహితి వేత్తగానూ మారిపోతుంది. ఇందులో మరింత ప్రొఫెషనల్ కావాలనుకుంటుంది. డాడ్ కమల్ హాసన్ తరహాలో స్క్రిప్ట్ లు కూడా రాయాల నుకుంటోంది. వరలక్ష్మి శరత్ కుమార్ ఇప్పటికే నటిగా సత్తా చాటింది. 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగానూ ఎంట్రీ ఇస్తుంది. సక్సెస్ అయిందంటే? కెప్టెన్ కుర్చీని కంటున్యూ చేసే అవకాశాలున్నాయి. అలాగే మలయాళం బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ రైటర్ గా మారే ఆలోచనలో ఉంది.



# నయనతార న్యూ స్ట్రాటజీ 'బోత్ ఆర్ నాట్ సేమ్'!





నందమూరి బాలకృష్ణ -అఖండ-లో -మీరు చదివింది చట్టం..మేం నమ్మేది ధర్మం బోత్ ఆర్ నాట్ సేమ్ అన్నట్టు లేడీ సూపర్ స్టార్ నయనతార కొత్త స్ట్రాటజీని ఫాలో అవుతోంది. బాలకృష్ణ చెప్పిన డైలాగ్‌ని అక్షరాలా పాటిస్తూ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. యావరేజ్ రేంజ్ ప్రొడక్షన్ హౌస్..భారీ ప్రొడక్షన్ హౌస్.. నా విషయంలో -బోత్ ఆర్ నాట్ సేమ్- అంటోంది నయన్. ఇంతకీ నయన్ ఫాలో అవుతున్న ఆ స్ట్రాటజీ ఏంటీ?..యావరేజ్ రేంజ్ ప్రొడక్షన్ హౌస్..భారీ ప్రొడక్షన్ హౌస్‌ల విషయంలో నయనతరాత ఏ స్ట్రాటజీని ఫాలో అవుతోంది. అసలు దీని వెనకున్న అసలు కథేంటన్నదే ఆసక్తిని రేకెత్తిస్తోంది. లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న నయనతార స్టార్ హీరోలకు ఏ మాత్రం స్థాయి క్రేజ్‌ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్‌గా పాపులారిటీని దక్కించుకున్న నయన్ ఆ క్రేజ్‌కు తగ్గట్టే సినిమాలని ఎంచుకుంటోంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూనే అప్పుడప్పుడు స్టార్ హీరోలతో కలిసి భారీ ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తోంది. ఈ విషయంలోనే నయనతార తన పంథాను మార్చుకుని వ్యవహరిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ప్రొడక్షన్ కంపనీ, భారీ స్పాన్ ఉన్న మూవీని బట్టి తన పారితోషికం విషయంలో మార్పులు చేస్తోందట. యావరేజ్ ప్రొడక్షన్ హౌస్ అయితే ఒక రేంజ్‌లో..అదే భారీ నిర్మాణ సంస్థ, సినిమా స్థాయిని బట్టి మరో రేంజ్‌లో పారితోషికం డిమాండ్ చేస్తూ నయనతార సరికొత్త స్ట్రాటజీని ఫాలో అవుతోందని తెలుస్తోంది. అయితే అన్ని సినిమాల విషయంలో ఈ పద్ధతిని ఫాలో కావడం లేదని సినిమా స్థాయిని బట్టే పారితోషికంలో మార్పులు చేస్తోందని తెలిసింది. తెలుగులో ఈ ఏడాది సంక్రాంతి బరిలో నిలిచిన మెగాస్టార్ మూవీ -శివ శంకరవరప్రసాద్‌గారు-. ఇందులో చిరకు జోడీగా నయన్ నటించడం తెలిసిందే. అంతేనా.. అందరిని షాక్‌కు గురి చేస్తూ ఈ మూవీ ప్రయోషనల్ వీడియోల్లోనూ నటించింది. ఈ సినిమా విషయంలో నయన్ అంతగా ఇన్వాల్వ్ కావడానికి కారణం పారితోషికం అని తెలిసింది. ఈ సినిమా కోసం నయన్ రూ.6 కోట్లు తీసుకుందట. అందులో భాగంగానే ప్రమోషనల్ కంటెంట్‌లోనూ కనిపించి అందరిని ఆశ్చర్యపరిచిందట. ఇక చిరు సినిమాకు రూ.6 కోట్లు తీసుకున్న నయనతార రాకింగ్ స్టార్ యష్ -టాక్సిక్-కు వచ్చేసరికి ప్లాన్ మార్చేసింది. సినిమా బడ్జెట్, యష్ కున్న మార్కెట్, సినిమా స్థాయిని బట్టి రూ.12 కోట్లు డిమాండ్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నయనతార ఫాలో అవుతున్న ఈ కొత్త స్ట్రాటజీపై ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే రాకింగ్ స్టార్ యష్‌తో కలిసి నయనతార నటించిన -టాక్సిక్- మార్చి 19న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే రోజు రణ్‌వీర్ సింగ్ -ధురంధర్ 2- కూడా రిలీజ్ అవుతుండటంతో రెండు సినిమాల్లో ఏది పై చేయి సాధిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# బోయపాటి శ్రీను కొత్త సినిమా.. స్టార్ హీరో గ్రీన్ సిగ్నల్

బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ సినిమాలకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుంది. కానీ, రీసెంట్‌గా వీరి నుంచి వచ్చిన 'అఖండ-2' ఆశించినంత రేంజ్‌లో మెప్పించలేదు. ఈ మూవీ తర్వాత బోయపాటి శ్రీను తదుపరి చిత్రంపై ఇప్పటి దాకా ఎలాంటి క్లారిటీ రాలేదు. భారీ బడ్జెట్ చిత్రాలను చేసేందుకు ఇష్టపడే బోయపాటికి బలమైన మార్కెట్ ఉన్న హీరో దొరకాలి. ఒక సమయంలో అల్లు అర్జున్‌తో ఒక సినిమా తీస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ, అది వర్కౌట్ కాలేదు. దీంతో బోయపాటి తన మనసుమార్చుకుని రానా దగ్గుబాటితో ఒక సినిమా తీయబోతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీ సమాచారం ప్రకారం, బోయపాటి తన రాబోయే చిత్రంలో ప్రధాన పాత్ర కోసం రానా దగ్గుబాటిని సంప్రదించాడని తెలుస్తోంది. చర్చలు ప్రారంభ దశలోనే ఉన్నాయని భావిస్తున్నప్పటికీ, ఇరువైపుల నుండి ఇంకా అధికారికంగా ధృవీకరణ రాలేదు. తన మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌తో రానాను మెప్పించే ప్రయత్నంలో బోయపాటి ఉన్నట్లు సమాచారం. కమర్షియల్ యాక్షన్ చిత్రాల వైపు ఆసక్తి చూపిస్తున్న రానా కూడా.. ఈ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. బోయపాటి శ్రీను కొద్దిరోజుల క్రితం ముంబై వెళ్లిన విషయం తెలిసిందే. అట్లీ మూవీ షూటింగ్‌లో ఉన్న అల్లు అర్జున్‌ను కలిసి కథ కూడా చెప్పారట. బోయపాటి చెప్పిన కాన్సెప్ట్ బన్నీకి బాగా నచ్చిందని వార్తలు కూడా వచ్చాయి. అయితే, ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీతో సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత త్రివిక్రమ్‌తో ఒక సినిమాను లాక్ చేశాడు. ఆ వెంటనే పుష్ప-3 ఎటూ ఉంది. ఈ సినిమాలన్నీ పూర్తి కావలంటే కనీసం 4ఏళ్లు పడుతుంది. అందుకే బోయపాటి మరో కథను రెడీ చేసి రానాకు వినిపించారని తెలుస్తోంది



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .